
Email : telanganaveenaoffcial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

epaper.telanganaveena.com | సంపుటి :1 | సంచిక: 365 | హైదరాబాద్ | గురువారం | 19 -09 - 2024 | పేజీలు: 8 | రూ.3/-




## ఒకే దేశం.. ఒకే ఎన్నికలు నివేదికకు

# మోదీ కేబినెట్ ఆమోదం



**తెలంగాణ వీణ/ న్యూఢిల్లీ, 18:** ఒకే దేశం ఒకే ఎన్నికలు మోదీ చిరకాల స్వప్నం.ఈ విధానంపై అధ్యయనం చేయటానికి నియమిం చిన మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవిద్ కమిటీ నివేదికకు కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దేశవ్యాప్తంగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను ఒకేసారి నిర్వహించటానికి ఈ కమిటీ చేసిన సిఫార్సులను మోదీ ప్రభుత్వం ఆమోదించింది. ప్రధాని మోడీ అధ్యక్షతన సెప్టెంబర్ 18 జరిగిన మంత్రి మండలి సమావేశంలో జమిలీ ఎన్నికల (వన్ నేషన్= వన్ ఎలక్షన్) బిల్లుకు సెంట్రల్ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ బిల్లును శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో లోక్ సభ, రాజ్య సభలో ప్రవేశ పెట్టనున్నారు. ఈ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపి చట్టరూపం దాలిస్తే దేశంలో 100 రోజుల్లోనే లోక్ సభ, అసెంబ్లీ, లోకల్ బాడీ ఎన్నికలు జరగనున్నాయి.

## చిన్న, మధ్య తరహా

# పరిశ్రమలకు ఊతం

- ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగు పరుస్తాం
- మహిళలు, పెట్టుబడిదారులకు ప్రోత్సాహం
- ట్రిలియన్ డాలర్ల ఎకానమీ కోసం కృషి
- స్కిల్ వర్సిటీ ద్వారా యువతకు శిక్షణ
- ఎంఎస్ఎంఈ పాలసీ-2024 ఆవిష్కరణలో సీఎం రేవంత్




**తెలంగాణ వీణ/హైదరాబాద్,సెప్టెంబర్18:** ఎంఎ స్ఎం ఈ పరిశ్రమల స్థాపన, అభి వృద్ధి దిశగా చర్యలకు పూనుకున్న రాష్ట్ర ప్రభుత్వం కొత్త పాలసీని తిసుకువచ్చింది. ఎంఎస్ఎంఈ చిన్న, మధ్యతరహా పరి శ్రమల పాలసీ 2024ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం మాదాపూర్ శిల్పకళా వేదికలో జరిగిన కార్య క్రమంలో ఆవిష్కరించారు. కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబుతో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ అధికారులు, పరిశ్రమల శాఖకు సంబం ధించిన 22 అసోసియేషన్స్ ప్రతిని ధులు, పారిశ్రామిక వేత్తలు హాజర య్యారు.చిన్న,

వివరాలు 2లో

## కెసిఆర్ పాలనలో

# అభివృద్ధి పరుగులు

- ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి: కెటిఆర్



**తెలంగాణ వీణ/హైదరాబాద్,18:** పదేళ్ల కేసీఆర్ పాలనలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగం అభివృద్ధిలో పరుగులు పెట్టిందని భారాస కార్యనిర్వహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. ఇది తాను చెబుతున్న లెక్క కాదని స్వయంగా కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారికంగా లెక్కలతో సహా వివరించిందన్నారు. కేసీఆర్‌పై బురద జల్లాలని తప్పుడు ఆరోపణలు చేసినప్పటికీ.. లెక్కలు మాత్రం అబద్దాలు చెప్పవని కేటీఆర్ స్పష్టం చేశారు. భారాస ప్రభుత్వం చేసిన అభివృద్ధిని తక్కువ చేసి చూపాలని ఎంత ప్రయత్నించినప్పటికీ అది సాధ్యం కాలేదన్నారు. కాంగ్రెస్ విడుదల చేసిన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పాలసీలో భారాస పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రస్తావించిన అంశాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. కేసీఆర్ పాలనలో పారిశ్రామిక ప్రగతి పరుగులు పెట్టిందనటానికి కాంగ్రెస్ చెప్పిన లెక్కలే నిదర్శనమన్నారు.



## తెలుగు రాష్ట్రాలకు యువ ఐపిఎస్‌ల కేటాయింపు

**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ,సెప్టెంబర్18:** రెండు తెలుగు రాష్ట్రాలకు యువ ట్రైనీ ఐపిఎస్‌లను కేటాయిస్తూ కేంద్రం బుధ వారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్కు హరియాణాకు చెందిన దీక్ష, తమిళనాడుకు చెందిన సుష్మిత, ఏపీకి చెందిన బొడ్డు హేమంత్ , మనీషా వంగల రెడ్డిలను కేటాయించింది. తెలంగాణకు జమ్మూకశ్మీర్‌కు చెందిన మనన్ భట్ , తెలంగాణకు చెందిన రుత్విక్ సాయి కొట్టే, సాయి కిరణ్, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన యాదవ్ వసుంధరను కేటాయించారు.

## మంత్రులు విధిగా

# గాంధీభవన్ రావాల్సిందే

- షెడ్యూలు ఖరారు చేస్తున్న పిసిసి చీఫ్




**తెలంగాణ వీణ/హైదరాబాద్,సెప్టెంబర్18:** రాష్ట్ర మంత్రులకు సంబంధించి టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సరికొత్త నిర్ణయం తీసుకున్నారు. ఇకపై వారానికి రెండు రోజులు మంత్రులు గాంధీభవన్‌కు వచ్చేలా ప్రణాళిక రూపొందించారు. ఆ మేరకు విధి విధానాలను, మంత్రుల షెడ్యూల్‌ను రూపొందించాలని గాంధీ భవన్ సిబ్బందికి టీపీసీసీ చీఫ్ ఆదేశాలు జారీ చేశారు. టీపీసీసీ అధ్యక్షులుగా మహేష్ కుమార్ గౌడ్ పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంత్రులు ప్రతి వారంలో రెండుసార్లు గాంధీ భవన్ రావాలని ఆయన సూచించారు. ప్రతి బుధ, శుక్రవారాలలో ఒక్క మంత్రి.. గాంధీ భవన్‌కు రావాలని మహేష్ సూచించారు. వచ్చే శుక్రవారం నుంచి గాంధీ భవన్‌కు మంత్రుల రాక ప్రారంభంకానున్నట్లు

వివరాలు 2లో

## నాగార్జునను

# 400 కోట్లు డిమాండ్

- ఇవ్వనందుకే ఎన్ కన్వెన్షన్ కూల్చివేత
- ఆనంద కన్వెన్షన్ ఎందుకు కూల్చలేదు
- వివేక్ ఫామ్‌హౌజ్‌ను కూల్చే దమ్ముందా
- మాజీ బిఆర్ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపణ




2లో

## జమిలి ఎన్నికలకు

# మేం వ్యతిరేకం

- ఎంఐఎం నేత అసదుద్దీన్ ప్రకటన



**తెలంగాణ వీణ/హైదరాబాద్,18:** జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికల నిర్వహణకు సంబంధించి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రూపొందించిన నివేదికను మంత్రి వర్గం ఆమోదించిన నేపథ్యంలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్‌ను పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్టు ప్రకటించారు. ఈ విధానం ఇది ఫెడరలిజాన్ని నాశనం చేస్తుందని ఆరోపించారు.రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణంలో భాగమైన ప్రజాస్వామ్యాన్ని ఇది రాజీ చేస్తుందని విమర్శించారు. ప్రధాని మోదీ, అమిత్ షాకు తప్ప.. ఎవరికీ బహుళ ఎన్నికలు సమస్య కాదని పేర్కొన్నారు. ఈ అంశంపై మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. జమిలి ఎన్నికలపై కేంద్ర మంత్రివర్గం ఆమోదం నేపథ్యంలో మనకు ఏకకాల ఎన్నికలు అవసరం కాదని తేల్చిచెప్పారు. తరచుగా ఆవర్తన ఎన్నికలు ప్రజాస్వామ్య జవాబుదారీతనాన్ని మెరుగుపరుస్తాయని ఓవైసీ పేర్కొన్నారు.

# పిల్లల భవిష్యత్ కోసం దీర్ఘకాలం పెట్టుబడి

- అమల్లోకి ఎన్‌పీఎస్ వాత్సల్య పథకం
- ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రారంభం




**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18:** పిల్లల కోసం బడ్జెట్‌లో ప్రకటించిన ఎన్‌పీఎస్ వాత్సల్యను కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం ప్రారంభించారు. పిల్లల భవిష్యత్ కోసం దీర్ఘకాలం పెట్టుబడి పెట్టాలనుకునే వారు ఈ పెన్షన్ ఖాతాను వినియోగించుకోవచ్చు. ఎన్‌పీఎస్ వాత్సల్య ఖాతాను ఆన్‌లైన్‌లో లేదా బ్యాంక్ శాఖను లేదా పోస్టాఫీసులో ప్రారంభించొచ్చు. ఎన్‌పీఎస్ వాత్సల్య ఖాతాలో కనీసం రూ.1000 మదుపు చేయొచ్చు. ఎన్‌పీఎస్ విత్‌డ్రాలకు సంబంధించి మార్గదర్శకాలను రూపొందిస్తున్నారు. భవిష్యత్‌లో మంచి ప్రతిఫలం అందుకోవాలను కునేవారు ఎన్‌పీఎస్ ఖాతాను ఎంచుకోవచ్చని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. గడిచిన పదేళ్లలో 1.86 కోట్ల మంది ఎంపిక చేసుకున్నారని, వారి మదుపు

వివరాలు 2లో

## భారీగా పెరిగిన వంట నూనె ధరలు

**తెలంగాణ వీణ/హైదరాబాద్,18:** కేంద్రం సామాన్యులకు భారీ షాక్ ఇచ్చింది. వంట నూనెలపై దిగుమతి సుంకాన్ని 20 శాతం వరకు పెంచేసింది.సన్‌ఫ్లవర్, సోయాబీన్, రిఫైన్డ్ పామాయిల్, వేరుశనగపై ఇంపోర్ట్ టాక్స్12.5 శాతం నుంచి 32.5 శాతానికి చేరింది. అన్ని రకాల నూనెల ధరలు లీటర్‌పై ఒక్కసా రిగా రూ. 15–20 వరకు పెరిగాయి. పామాయిల్ ధర రూ.100 నుంచి రూ.115–120, సన్‌ఫ్లవర్ రూ.115 నుంచి రూ.130–140, వేరుశనగ నూనె రూ.155 నుంచి రూ.165–170కు చేరింది.

## ఎసిబి వలలో అవినీతి చేప

**- లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అధికారి**

**తెలంగాణ వీణ/కొత్తగూడెం,సెప్టెంబర్18:** కొత్తగూడెం జిల్లాలో ఓ అవినీతి చేప ఏసీబీ వలలో చిక్కింది. లంచం తీసుకుంటూ కొత్తగూడెం జిల్లా హార్టికల్చర్ అధికారి ఏసీబీకి పట్టుబడ్డారు. పక్కా సమాచారంతో కొత్తగూడెం కలెక్టరేట్ లో సోదాలు నిర్వహించిన ఏసీబీ అధికారులు హార్టికల్చర్ ఆఫీసర్ ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. కొత్తగూడెం కలెక్టరేట్ లో బుధవారం ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. ఈ సోదాల్లో జిల్లా హార్టికల్చర్ఆఫీసర్ సూర్య నారాయణ లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా దొరికారు. డ్రిప్ ఇరిగేషన్ పర్మిషన్ కోసం లంచం డిమాండ్ చేసిన సూర్యనారాయణ..బాధితుడి నుంచి రూ.1.14 లక్షలుతీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. హార్టికల్చర్ అధికారి సూర్య నారాయణను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు ఏసీబీ డిఎస్పీ వై.రమేష్.

## జవాన్ల మధ్య వివాదం.. కాల్పుల్లో జవాన్ మృతి

**తెలంగాణ వీణ/భద్రాచలం,సెప్టెంబర్18:** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బలరాంపూర్ జిల్లాలోని ఓ పోలీస్ క్యాంపులో కొందరు జవాన్ల మధ్య వివాదం చోటుచేసుకుంది. బూతాహీ పోలీస్ క్యాంప్‌లో సీఏఎఫ్ ఛత్తీస్‌గఢ్ ఆర్మ్డ్ ఫోర్స్‌కు చెందిన ఓ జవాన్ తన తోటి జవాన్లపై కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో ఓ జవాన్ అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. అయితే కాల్పులకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన జవాన్లను అంబులెన్స్‌లో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ సమాచారం అందుకున్న ఎస్పీ రాజేష్ అగర్వాల్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

## డిఎస్పీగా నిఖత్ జరీన్

**- నియామక పత్రం అందచేసిన డిజిపి**



**తెలంగాణ వీణ/హైదరాబాద్,సెప్టెంబర్18:** భారత స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్‌కు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. నిజామాబాద్‌కు చెందిన బాక్సర్ నిఖత్ జరీన్‌కు డీఎస్పీ ఉద్యోగం లభించింది. ఈ మేరకు తెలంగాణ డీజీపీ జితేందర్ చేతుల మీదుగా నిఖత్ జరీన్ డీఎస్పీగా నియామక పత్రం అందుకున్నారు. నిఖత్ జరీన్‌కు మూడేళ్ల పాటు ప్రొబెషనరీ ట్రైనింగ్ ఉంటుంది. కాగా, గత నెల 1న జరిగిన కేబినెట్ సమావేశంలో ఆమెను గ్రూప్ వన్ స్థాయి అధికారిగా నియమించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. సెక్షన్ 4లోని తెలంగాణ రెగ్యులేషన్ ఆఫ్ అపాయింట్‌మెంట్స్‌కు సవరణ చేసి స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ కు గ్రూప్ 1 స్థాయి ఉద్యోగం ఇవ్వాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం హోంశాఖను ఆదేశించింది.

## ప్రభుత్వ ఆస్పత్రులపై బురదజల్లడం మానుకోండి

**- కెటిఆర్‌కు మంత్రి దామోదర ఘాటు హెచ్చరిక**

**తెలంగాణ వీణ/హైదరాబాద్,సెప్టెంబర్18:** ప్రభుత్వ దవాఖాన్లను నాశనం చేసే కుట్రలను మానుకోవాలని భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర హెచ్చరించారు. గాంధీ ఆసుపత్రిపై బురద చల్లి.. అక్కడికి వైద్యం కోసం వచ్చే నిరుపేదల మనోస్థైర్యాన్ని దెబ్బతీయడం బాధాకరమని మండిపడ్డారు. గాంధీ, ఉస్మానియా వంటి ప్రభుత్వ దవాఖానాలను పదేళ్లపాటు నాశనం చేసిన భారాస... ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి కూడా అదే తరహాలో కుట్రలు చేయడం సిగ్గుచేటు అన్నారు. భారాస ప్రభుత్వం నాశనం చేసిన ప్రభుత్వ వైద్య వ్యవస్థను గాడిన పెడుతున్నామని, అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. భారాస కుట్రలను నమ్మి భయపడవద్దని... ధైర్యంగా ఆసుపత్రికి వచ్చి వైద్యం చేయించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గాంధీ ఆసుపత్రిని నాశనం చేసి పేద రోగులు రాకుండా చేసి కార్పొరేట్ ఆసుపత్రులకు లబ్ధి చేకూర్చాలని కేటీఆర్ కుట్రపన్నుతున్నారని ఆరోపించారు. పేదలకు ఉపయోగపడే ప్రభుత్వ వ్యవస్థలను నాశనం చేయడం మానుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హితవు పలికారు.

## చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఊతం

(మొదటి పేజీ తరువాయి)

మధ్య తరహా పరిశ్ర మలు ఎదుర్కొం టున్న ఆరు అదం కులను ఈ కొత్త పాలసీ ద్వారా ప్రభుత్వం గుర్తించింది. భూమి సౌలభ్యత మూలధన లభ్యత, ముడిపదార్థాల అందు బాటు శ్రామిక, శక్తి కొరత, సాంకే తిక సౌలభ్యత లేక పోవడం, మార్కెట్లతో అనుసంధానం లేకపోవడం వంటి అంశాలు తెలం గాణలోని ఎంఎస్ఎంఈలు ఎదు ర్కొంటున్న సవాళ్లుగా ప్రభు త్వం గుర్తించింది. ఈ అడ్డంకు లను తొలగించడానికి 40 ప్రతిపాద నలు చేసింది. సరస మైన ధరలకు భూ మిని అందించ డం, ఆర్థిక వనరులను అందుబాటులో ఉంచడం, ముడి పదార్థాల లభ్యతను అందు బాటులో ఉంచ డం. నైపుణ్యం గల కార్మికుల లభ్య త మెరుగుప రచడం, నూతన సాంకేతికతను ప్రోత్స హించడం, మార్కెట్లతో అనుసంధానత మెరు గుపరచడం వంటి అంశాలతో ఎంఎస్ఎంఈలకు దన్నుగా నిలవబోతున్నట్లు పాలసీలో పేర్కొన్నది.ఇదిలా వుండగా ప్రభుత్వం నిర్మించాలని భావిస్తున్న ప్రతి పారి శ్రామి క పార్కులో 20 శాతం ప్లాట్లు ఎంఎస్ఎంఈల కోసం రిజర్వు చేయను న్నట్లు కొత్త పాలసీలో ప్రభుత్వం పేర్కొన్నది. వచ్చే ఐదేళ్లలో ప్రతి జిల్లాలో ఒక పారిశ్రా మికి పార్కు ఏర్పా టు చేయబోతున్నామని, అలాగే ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య 10 పారిశ్రామిక పార్కులను ప్రభుత్వం నిర్మిం చబోతున్నదని స్పష్టం చేసిం ది. ఈ 10 పారిశ్రామిక పార్కులలో 5 ఎంఎస్ఎంఈ పార్కులు ఉండ నున్నాయి. వీటిలోని ప్రతి ఎంఎస్ ఎంఈ పార్కులో 5 శాతం ప్లాట్లు మహిళా పారిశ్రామిక వేత్తలకు, 15 శాతం ప్లాట్లు ఎస్సీ, ఎస్టీ పారిశ్రా మిక వేత్తలకు రిజర్వ్ చేయను న్నట్లు ప్రభుత్వం తెలిపింది. అలాగే ఎంఎస్ఎంఈలను సమర్థవం తంగా అమలుపరిచి నిర్వహణ, పర్య వేక్షణ కోసం ఉన్నతస్థాయి స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేయనున్నది.గతంలో ఉన్న టీఎస్ ఐపాస్ పాలసీ వల్ల పెద్ద కంపెనీలకే ప్రయోజనం ఉందని, అందువల్ల కొత్త ప్రభుత్వం వచ్చాక ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేకంగా ఎంఎస్ ఎంఈల కోసం పాలసీ ఉం డాలని సూచించారని ఐటీ, పరి శ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్య దర్శి జయేశ్ రంజన్ చెప్పారు. దేశంలో ఎంఎ స్ఎం ఈలకు సంబం ధించి రాష్ట్ర పరిస్థితి మెరుగు పడే లా ఈ పాలసీ రూపొందిం చామ న్నారు. కంపెనీ లు, సంస్థల తో పోలిస్తే ఎంఎ స్ఎం ఈలు అనేక సవాళ్లు, సమ స్యలు ఎదుర్కొంటు న్నాయని వీటిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందిచాలనేది ఈ పాలసీలో పొందుపరి చామన్నారు.

## మంత్రులు విధిగా గాంధీభవన్ రావాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. తెలంగాణ పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన మహేష్ ముందు పెద్ద సవాలే ఉంది. త్వరలో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. తాము ప్రజా పాలనను అందిస్తున్నామని.. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని కాంగ్రెస్ చెబుతోంది. మరోవైపు కాంగ్రెస్ పాలనపై ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నేతలు దుమ్మెత్తిపోస్తున్న పరిస్థితి. ఈ నేపథ్యంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలవడం మహేష్ ముందున్న అతిపెద్ద సవాల్‌గా చెప్పుకోవచ్చు. ఇకపోతే పార్టీలో సీనియర్ నేత మహేష్ కుమార్‌కు టీపీసీసీ చీఫ్ పదవి వరించింది. మహేష్‌కు నాలుగు దశాబ్దాలుగా పైగా కాంగ్రెస్ పార్టీతో అనుబంధం ఉంది. ఎలాంటి పదవులు ఆశించని వ్యక్తి ఆయన. అందరినీ కలుపుకుంటూ పోతూ అధిష్టానం తనకు అప్పగించిన పనులను చేసుకుంటూ వెళ్తుంటారు. టీపీసీసీ చీఫ్‌గా మహేష్ కుమార్‌ను కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణలో బీసీ ఓటర్లు ఎక్కువగా ఉండటం.. ఈ మధ్య కాలంలో బీసీ నినాదం ఎక్కువ వినిపిస్తుండటంతో.. బీసీ సామాజిక వర్గానికి చెందిన మహేశ్ కుమార్ గౌడ్‌కు పీసీసీ పదవి దక్కింది.

## పిల్లల భవిష్యత్ కోసం దీర్ఘకాలం పెట్టుబడి

(మొదటి పేజీ తరువాయి)

విలువ రూ.13 లక్షల కోట్లుగా ఉందని పేర్కొన్నారు. ఎన్‌పీఎస్‌లో పెట్టుబడులు ఈక్విటీలో 14 శాతం, కార్పొరేట్ డెట్‌లో 9.1 శాతం, ప్రభుత్వ సెక్యూరిటీల్లో 8.8 శాతం చొప్పున ప్రతిఫలం ఇచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఎన్‌పీఎస్ ఖాతాకు వాత్సల్య అదనం. చిన్నారుల పేరు మీద ఎవరైనా ఖాతా తెరిస్తే వారికి 18 ఏళ్లు వచ్చాక సాధారణ ఖాతాగా మారుతుంది. ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ వంటి బ్యాంకులు ఎన్‌పీఎస్ వాత్సల్య పథకాన్ని ప్రారంభించాయి. పథకం ప్రారంభం ఐసీఐసీఐ బ్యాంక్ కొందరు చిన్నారుల పేరు మీద వాత్సల్య ఖాతాలను ప్రారంభించింది. తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ ఆధారంగా వాత్సల్య స్కీమ్‌లో ఎప్పటికప్పుడు మార్పులు చేపడతామని ఆర్థిక శాఖ కార్యదర్శి నాగరాజు మద్దిరాల ఈ సందర్భంగా తెలిపారు.

## రాహుల్‌కు ప్రధాని మోడీ క్షమాపణలు చెప్పాలి

**- విమర్శలకు తోణం సమాధానం ఇవ్వాలి: సీతక్క**

**తెలంగాణ వీణ/మహబూబాబాద్,సెప్టెంబర్18:** రాహుల్‌కు వస్తున్న ప్రజాదరణను చూసి తట్టుకోలేక బిజెపి, బిఆర్ఎస్ అవాకులు చవాకులు పేలుతున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు. కాబోయే ప్రధాని అభ్యర్థిపై ఇష్టానుసారం వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. జిల్లాలో మంత్రి సీతక్క పర్యటించారు. కొత్తగూడ, గంగారం మండలాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఏజన్సీ ప్రాంతం కావడంతో పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీజేపీ.. బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒక్కటే అన్నారు. బీజేపీ రాహుల్ గాంధీని... బీఆర్ఎస్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేశామయన్నారు. గంగారం, కొత్తగూడ మండలంలో నిరుపేదలు అందరికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని ప్రకటించారు. హర్యానాలో బీజేపీ ఎమ్మెల్యేలు రాహుల్ గాంధీనీ చంపుతామని బెదిరిస్తూ ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని.. వెంటనే వారిపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు త్యాగం చేసిన ఇందిరాగాంధీ కుంటుంబం పై బీజేపీ కుట్ర చేస్తుందంటూ.. వెంటనే ప్రధాని మోదీ రాహుల్ గాంధీకి క్షమాపణలు చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీపై బీజేపీ కుట్రలును తిప్పికొడతామని.. రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణను బీఆర్ఎస్ అడ్డుకోవాలని చూసిందన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల భాష దారుణంగా ఉందని .. హుజూరాబాద్ ప్రజలను బ్లాక్ మెయిల్ చేసి గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే రోడ్డు ఎక్కాడని విమర్శించారు. బీజేపీ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల భాష.. వారి ప్రవర్తనను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని మంత్రి సీతక్క అన్నారు.



## మానవత్వం చాటుకున్న కుమారి ఆంటీ



**తెలంగాణ వీణ/హైదరాబాద్,సెప్టెంబర్18:** తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల వరద బీభత్సం సృష్టించిన సంగతి తెలిసిందే.ఈ క్రమంలోనే వరద బాధితు లను ఆదుకునేందుకు కుమారి ఆంటీ ముందు కొచ్చింది.కుమారి ఆంటీ అంటే తెలియని వాళ్లుండరు. ఆమధ్య.. సోషల్ మీడి యాలో సునామీ సృష్టించి ఏకంగా ప్రభుత్వాన్నే కదిలించిన కుమారి ఆంటీ ఈమధ్య కొంచెం సైలెంట్ అయ్యింది.అయితే ఇప్పుడు తన గొప్ప మనసు చాటుకుని మరోసారి తెరపైకి వచ్చింది. హాయ్ నాన్న.. మీది మొత్తం 1000 అయ్యింది.. రెండు లివర్లు ఎక్స్ట్రా అంటూ చిన్నపిల్లల నుండి పెద్దవాళ్ల వరకు ఆప్యాయం గా పలకరించిన కుమారి ఆంటీ ఇప్పుడు తన పెద్ద మనుసు చాటుకుంది. వరద బాధితులకు తన తాహతకు తగ్గట్టుగా కుమారి ఆంటీ ముఖ్య మంత్రి సహాయనిధికి రూ.50 వేలు విరాళం అందజేసింది. తన కుమార్తె తో కలిసి స్వయంగా సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ఆయనకే రూ.50 వేల చెక్కును అందజేసింది కుమారి ఆంటీ..తాను చేసుకునే చిన్న వ్యాపారంతో కష్టపడి సంపాదించిన డబ్బులో నుంచి వరద బాధితులకు సాయం అందించి కుమారి ఆంటీ ఎంతో మందికి ఆదర్శంగా నిలిచిందని పలువురు ఆమెను అభినందిస్తున్నారు.

## నల్లగొండ బిఆర్ఎస్ కార్యాలయం కూల్చేయండి

**- అనుమతి లేకుండా నిర్మించడంపై హైకోర్టు ఆగ్రహం**



**తెలంగాణ వీణ/హైదరాబాద్,సెప్టెంబర్18:** అనుమతి లేకుండా నిర్మించిన బీఆర్ఎస్ ఆఫీస్‌ను కూల్చేయాలని తెలంగాణ హైకోర్టు అధికారులను ఆదేశించింది. నల్గొండలోని ఆఫీస్‌ను పదిహేను రోజుల్లో నేల మట్టం చేయాలని స్పష్టం చేసింది. నల్గొండలో ఉన్న బీఆర్ఎస్ ఆఫీస్‌ను రెగ్యులరైజ్ చేసేలా అధికారులను ఆదేశించాలన్న పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. అనుమతి తీసుకోకుండా ఆఫీస్ కట్టి... ఇప్పుడు రెగ్యులరైజ్ చేయాలని అడగడం ఏంటని ప్రశ్నించింది. అనుమతులు లేకుండా అక్రమంగా కట్టిన ఆఫీస్‌ను 15 రోజుల్లో కూల్చేయాలని స్పష్టం చేసింది. దీంతోపాటు దానికి అయ్యే ఖర్చును నష్టపరిహారం రూపంలో లక్షరూపాయలను బీఆర్ఎస్ పార్టీ చెల్లించాలని తేల్చి చెప్పింది. నల్గొండలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని 15 రోజుల్లోగా కూలగొట్టాలని హైకోర్టు ఆదేశించింది. పార్టీ కార్యాలయాన్ని రెగ్యులర్ చేసే విధంగా మున్సిపల్ శాఖ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. పార్టీ కార్యాలయం కట్టిన తర్వాత ఏ రకంగా అనుమతిస్తారని హైకోర్టు ఈ పిటిషన్ పై విచారణ సందర్భంగా సూటిగా ప్రశ్నించింది. కట్టకముందు అనుమతి తీసుకోవాలి కానీ కట్టిన తర్వాత ఎలా అనుమతి తీసుకుంటారని హైకోర్టు పిటిషనర్‌ను అడిగింది. 15 రోజుల్లో పార్టీ కార్యాలయాన్ని కూలగొట్టాలని హైకోర్టు ఆదేశించింది. నల్గొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ కూల్చివేతకు గత నెల తాత్కాలికంగా బ్రేక్‌పడింది. ఆగస్టు 11లోగా పార్టీ ఆఫీస్ కూల్చివేయాలని జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులకు డెడ్‌లైన్ పెట్టిన సంగతి తెలిసిందే. అయితే నెల రోజులు అవుతున్నా పార్టీ ఆఫీస్ కూల్చివేతపై అధికారుల నుంచి ఎలాంటి కదలిక లేదు. పార్టీ ఆఫీస్?ను టచ్?చేస్తే అంతుచూస్తామని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్?రెడ్డి సైతం హెచ్చరించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పార్టీ ఆఫీస్ వివాదం పెద్ద రాజకీయ దుమారం రేపింది.పార్టీ బిల్డింగ్‌కు మున్సిపల్‌పర్మిషన్ లేదని, దాన్ని కూల్చేయాలని డీటీసీపీ కమిటీ సిఫార్సు చేసింది. దీంతో అధికారులు కూడా టెన్షన్ పడ్డారు. చివరకు బీఆర్ఎస్ నాయకత్వం హైకోర్టును ఆశ్రయించింది. రెగ్యులరైజేషన్ పర్మిషన్ లేనందున దీనికి ప్రత్యామ్నాయం మార్గం చూపాలని హైకోర్టు డైరెక్షన్ ఇచ్చిందని మున్సిపల్ కమిషనర్ ముసాక్ అహ్మద్ అప్పట్లో?తెలిపారు. దీంతో అప్పటికి పార్టీ ఆఫీస్ కూల్చివేత ఆగిపోయింది.

## నాగార్జునను 400 కోట్లు డిమాండ్

**- ఇవ్వనందుకే ఎన్ కన్వెన్షన్ కూల్చివేత - ఆనంద కన్వెన్షన్ ఎందుకు కూల్చలేదు - వివేక్ ఫామ్‌హౌజ్‌ను కూల్చే దమ్ముందా**

**- మాజీ బిఆర్ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపణ**



**తెలంగాణ వీణ/హైదరాబాద్,సెప్టెంబర్18:** సినీ నటుడు అక్కినేని నాగార్జున రూ.400 కోట్లు అడిగితే ఇవ్వనందుకే ఎన్ కన్వెన్షన్ కూలగొట్టారని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ సంచలన ఆరోపణలు చేశారు. బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎఫ్‌టీఎల్ జోన్‌లో ఉందని నాగార్జునకు సంబంధించిన ఎన్ కన్వెన్షన్‌ను కూలగొట్టారు. అయితే హిమాయత్ సాగర్‌లో ఆనంద కన్వెన్షన్ ఉంది. ఎన్ కన్వెన్షన్ కూలగొట్టిన ఈ మొగోడు, సిఫాయి, హైదరాబాద్‌లోని చెరువులను రక్షించే రక్షడు రేవంత్ రెడ్డి ఆనంద కన్వెన్షన్‌ను ఎందుకు కూలగొట్టడం లేదని ప్రశ్నించారు. ఇండస్ట్రీలో నడుస్తున్న టాక్ ఏంటంటే నాగార్జున రూ.400 కోట్లు ఇవ్వనందుకే కూల్చివేస్తున్నారనే చర్చ జరుగుతుందన్నారు. ఆనంద కన్వెన్షన్ వాళ్లు ముడుపులు ముట్ట చెప్పినందుకే కూల్చలేదని ఆరోపించారు. మాదాపూర్‌లోని సున్నం చెరువు దగ్గర దళిత బిడ్డలు ఇండ్లు కూలగొట్టావు. మహబూబ్‌నగర్‌లో కూలగొట్టావు. కానీ గండిపేట చెరువులో 18 ఎకరాల్లో కట్టిన మీ కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ చెరువును ఆక్రమించి ఫాంహౌజ్, గోల్ఫ్ కోర్స్ నిర్మిస్తే ఎందుకు కూలగొట్టవని సూటిగా ప్రశ్నించారు. వారి కాంపౌండ్ వాల్ ముట్టుకునే దమ్ముందా అని నిలదీశారు. పేదల ఇండ్లు కూల్చేందుకు రంగనాథ్‌కు, సీఎం బుల్డోజర్లు దొరుకుతవి. కానీ, వివేక్ ఇంటిని ముట్టుకోవడానికి దొరుకవా అని ప్రశ్నించారు. పేదలకు ఒక నీతి, మీడియా అధిపతులకు, పారిశ్రామిక వేత్తలకు ఇంకో నీతా అని నిలదీశారు. ప్రజలు కాంగ్రెస్ పాలనపై ఆలోచన చెయ్యాలన్నారు. తెలంగాణలో దరిద్రపు పాలన నడుస్తోందని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఈ సందర్భంగా వ్యాఖ్యలు చేశారు. ఇచ్చిన హామీలు చర్చకు రావొద్దనే రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. సునీల్ కనుగోలు స్క్రిప్ట్ ప్రకారమే తిట్ల పురాణం... హైడ్రా డ్రామాలు అంటూ విరుచుకుపడ్డారు. ఇందిరమ్మ రాజ్యంలో అవినీతి కుటుంబ పాలన, దందాలు నడుస్తున్నాయన్నారు. పార్టీ ఫిరాయింపులపై రాహుల్ గాంధీది ఒక విధానం... రేవంత్ రెడ్డికి ఇంకో విధానమా అని ప్రశ్నించారు. హైడ్రా పేరుతో భయపెట్టి వసూళ్ల దందా చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్‌కు బ్రాండ్ అంబాసిడర్ అంటూ దుయ్యబట్టారు. ఫ్యూచర్ సిటీ పేరిట రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా పాలన నడుస్తలేదని... ప్రతిపక్ష ఎమ్మెల్యేల మీద కేసులు పెడుతున్నారన్నారు. కేసీఆర్, కేటీఆర్‌తో పాటు తమ నాయకుల వ్యక్తిత్వాల మీద సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్‌లు పెడుతున్నారన్నారు. రేవంత్ టీమ్లో ఉండి ఫేక్ న్యూస్‌లు పెడుతున్న వారిని కేసీఆర్, కేటీఆర్ వదిలిపెట్టినా తాను వదిలి పెట్టనని బాల్కసుమన్ హెచ్చరించారు.


తెలంగాణ వీణ
తెలంగాణ వీణ ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
8328209811

# ప్రతి ఒక్కరికీ విజన్ డాక్యుమెంట్ ఉండాలి

**● నియోజకవర్గాల వారీగా తయారు చేసుకోవాలి ● గత ప్రభుత్వం ఖాళీ ఖజానా అందించింది ● జీతాలు ఇచ్చేందుకు కూడా పైసా లేకుండా చేసింది ● రూ.10లక్షల కోట్ల అప్పు.. రూ.లక్ష కోట్ల పెండింగ్ బిల్లులు ● అయినా ధైర్యంగా ముందుకు వెళుతున్నాం ● ఎన్‌డిఎ శాసనసభాపక్ష భేటీలో చంద్రబాబు వెల్లడి ● చంద్రబాబు దార్శనిక నేత అన్న పవన్ కళ్యాణ్ ● ఆయన పక్కనుండి పనిచేయడం అదృష్టమని వ్యాఖ్య**





**తెలంగాణ వీణ/అమరావతి,సెప్టెంబర్18:** రాష్ట్రానికి రూ. 10లక్షల కోట్ల అప్పు.. రూ.లక్ష కోట్ల పెండింగ్ బిల్లులు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... గత ప్రభుత్వం నిధులు దుర్వినియోగం చేసింది, కేంద్రం నిధులను పక్కదారి పట్టించిందని విమర్శించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు నియోజకవర్గాల వారీగా విజన్ డాక్యుమెంట్లు రూపొందించుకోవాలని దిశానిర్దేశం చేశారు. ధికారంలోకి వచ్చినప్పుడు ఖజానాలో ఎక్కడా డబ్బులు లేవు. జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి. అయినా ధైర్యంతో ముందు కెళు_తున్నాం. వచ్చే ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాల కల్పన దిశగా పనిచేస్తున్నాం. కేంద్ర సహకారం లేకపోతే రాష్ట్రం అభివృద్ధి చెందదు. కేంద్ర సహాయం వెంటిలేటర్‌పై ఉన్న వ్యక్తికి ఆక్సిజన్ లాంటిది. మూడు పార్టీల సమష్టి కృషితోనే ఇంతటి ఘన విజయం సాధించాం. నా జీవితంలో ఎన్నడూ చూడని విజయమిది. 151 సీట్లు ఉన్నాయని విర్రవీగిన వారు.. 11 సీట్లకే పరిమితమయ్యారు అదే ప్రజాస్వామ్యం అని చంద్రబాబు అన్నారు. సీఎం చంద్రబాబు దార్శనికుడు.. అను నిత్యం తనను ఆశ్చర్యపరుస్తూనే ఉంటారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. చంద్రబాబు నాయకత్వంలో పనిచేయడం సంతోషంగా ఉందన్నారు.వందరోజుల్లో చాలా హామీలు నెరవేర్చాం. పింఛన్ పెంచేందుకు ఖజానాలో డబ్బులు లేవు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పింఛన్లు పెంచాం. సంక్షేమంలో తిరుగులేని చరిత్ర సృష్టించాం. గతంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు సరైన సమయానికి వచ్చేవి కావు. నిర్జీవమవుతున్న పంచాయతీలకు సీఎం రూ.1,452 కోట్లు ఇచ్చారు. వైకాపా సర్పంచ్‌లు ఉన్న పంచాయతీలకు కూడా నిధులు ఇస్తాం. అన్న క్యాంటీన్ల వల్ల పేదలు, కార్మికులకు లాభం జరుగుతుంది. గత ప్రభుత్వానికి అన్న క్యాంటీన్లను ఎలా మూసివేయాలని పించింది? ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దు చేసి పేదల భూములను రక్షించిన సీఎంకు కృతజ్ఞతలు. చంద్రబాబు ఓపిక నన్ను ఆశ్చర్యపరుస్తుంది. పాతికేళ్ల యువకుడు కూడా చంద్రబాబులా కష్టపడలేరు. సీఎం బురదలో దిగి నడుస్తుంటే.. వైకాపా విమర్శలు చేస్తుంది. ఆయన చేసే మంచి పనులను గుర్తించి అండగా ఉంటాం అని పవన్ కల్యాణ్ అన్నారు. సీఎం చంద్రబాబుపైఅక్రమ కేసులు పెట్టి జైల్లో ఉంచినప్పుడు షూటింగ్‌లకు వెళ్లలేదని పవన్ కల్యాణ్ తెలిపారు. చంద్రబాబుకు అపారమైన అనుభవం ఉందని.. ప్రతిపక్షంలో ఉన్నా కూడా ఏనాడూ ఆయన కళ్లలో భయం కనిపించలేదని అన్నారు. 'సమష్టి కృషితో లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించాం. మొదటి నుంచి 160 స్థానాలు గెలవాలని చంద్రబాబు చెబుతూనే ఉన్నారు. చంద్రబాబులో భయం లేదు. అపారమైన అనుభవం ఉంది. బాబు తన జీవితంలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. మాజీ సీఎం జగన్, వైసీపీ నేతలు.. చంద్రబాబు కుటుంబ సభ్యుల్ని అవమానపరిచారు. కేబినెట్లో తీసుకున్న నిర్ణయాలకు ఆయన్ని బలి చేశారు. రాజమండ్రి జైల్లో కలిసినప్పుడు ఆయన గుండె ధైర్యాన్ని చూశా. బాబులో ఆత్మస్థైర్యం ఏనాడూ దెబ్బతినలేదు. పాలన ఎలా ఉండాలో బాబు పక్కనే ఉండి నేర్చుకోవాలనుకున్నా. జైల్లో ఉన్నప్పుడు నేను సినిమా షూటింగులకు కూడా వెళ్లలేదు. షూటింగ్‌కు రావాలని ప్రొడ్యూసర్లు అడిగినా నేను రానని చెప్పా. విభజన కాలం నుంచి జగన్ పాలన వరకు రాష్ట్రం నలిగిపోతూనే ఉంది. చంద్రబాబు నాయకత్వంలో పనిచేయడం చాలా ఆనందంగా ఉంది' అని పవన్ తెలిపారు.



## బదిలీపై వచ్చిన ప్రిన్సిపాల్‌కు ఉపాధ్యాయుల బృందం సన్మానం



**తెలంగాణ వీణ/చిట్యాల, సెప్టెంబర్ 18:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలో తెలంగాణ ఆదర్శ పాఠశాల కళాశాల, (మోడల్ స్కూల్, కళాశాల) ఇంచార్జ్ ప్రిన్సిపల్ గా మేకల రమేష్. బదిలీపై వచ్చారు, ఈ సందర్భంగా పాఠశాల కళాశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పి జోష్ణ దేవి, జి, ధనలక్ష్మి , డి,వాణి,దివ్య శివ వీర ప్రసాద్, సమీరా నిషాత్, ,రవీందర్, అయోషాతబ్బషుమ్ , వెంకటేశ్వర్లు, రాజు , ఎండి కలీమ్ పాషా, డి, శ్రీకాంత్, మదునయ్య, ఫిజికల్ డైరెక్టర్ జంగపల్లి సమ్మయ్య, విద్యార్థులు పాల్గొని. అభినందనలు తెలిపారు.

## ఆరెల్లి వెంకటి దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు...



**తెలంగాణ వీణ/మంథని, సెప్టెంబర్ 18:** ఈరోజు రామగిరి మండల పరిషత్తు తాజా మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క- కొమురయ్య వారి తండ్రి ఆరేల్లి వెంకటి దశదినకర్మ కార్యక్రమం లో హాజరైన రామగిరి మండల కాంగ్రెసు నాయకులు... మంథని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బర్ల శ్రీను, రామగిరి మండల కాంగ్రెసు ప్రచార కమిటీ చైర్మన్ ముస్త్యాల శ్రీనివాస్, పెద్దపల్లి జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు ముస్కుల సురేందర్ రెడ్డి, అజీమ్ ఖాన్ సీనియర్ నాయకులు,చింతపట్ల నాగరాజు, సిద్ధం రాము, మోత్కూరి అవినాష్ ,మార్కొండ సంతోష్, కుంట చక్రవర్తి,బండి సంపత్,పంజల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**తెలంగాణ వీణ/మొగుళ్లపల్లి, సెప్టెంబర్ 18:** మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ ను పట్టుకున్న ఘటన మొగుళ్లపల్లి ఎస్సై బొరగల అశోక్ అందించిన సమాచారం మేరకు. మొగుళ్లపల్లి మండలం వేములపల్లి గ్రామ శివారులోని పెద్దవాగు నుండి. అక్రమంగా ఇసుకను తరలిస్తునట్లు నమ్మదగిన సమాచారం మేరకు. ఎస్సై ఘటన స్థలానికి వెళ్లగా. గమనించిన ఇద్దరు ట్రాక్టర్ డ్రైవర్లు నంబర్ ప్లేట్ లేని రెండు ఇసుక ట్రాక్టర్లను అక్కడే డ్రైవర్లు వదిలి పారిపోవడం జరిగిందని. పారిపోయిన వారి వివరాలు విచారించగ హనుమకొండ జిల్లా నడికూడ మండలం, వరికోల్ గ్రామానికి చెందిన గడ్డం కిరణ్, దొగ్గెల వీరన్న, అని తెలిసిందని పట్టుబడిన రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయడం జరిగిందని. ఎస్సై బొరగల అశోక్ తెలియజేశారు.

## టీపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను గజమాలతో సన్మానించిన టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు

**తెలంగాణ వీణ/హనుమకొండ ప్రతినిధి, సెప్టెంబర్ 18:** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పిసిసి అధ్యక్షులుగా నియామకమై, బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారిగా వరంగల్ జిల్లాకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను, టి పి సి సి లీగల్ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఆయన వెంట లీగల్ సెల్ నాయకులు, రాష్ట్ర, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# రానున్న రోజులలో కేంద్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీయే..

**● హనుమకొండ చౌరస్తా వద్ద రాహుల్ గాంధీ పై, బిజెపి నేత చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ధర్నా చేపట్టిన కాంగ్రెస్ ● మోడీ ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను చూసి బీజేపీ దిగజారుడు రాజకీయాలు చేస్తోంది ● పార్లమెంట్ సాక్షిగా కుల గణన చేసి తీరుతామని ప్రకటించిన నాయకుడు రాహుల్ గాంధీ**









**తెలంగాణ వీణ/హనుమకొండ ప్రతినిధి, సెప్టెంబర్ 18 :** రాబోయే రోజులలో దేశంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీయే అని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. బుధవారం రాహుల్ గాంధీ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిజెపి వెంటనే క్షమాపణలు చెప్పాలని, రాహుల్ గాంధీ పై బీజేపీ వివాదస్పద వ్యాఖ్యలను నిరసిస్తూ.. హన్మకొండ అంబెడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభకర్ తో కలసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ.. ఏఐసీసీ అగ్రనేత, పార్లమెంట్ ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోమని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మండి పడ్డారు. బీజేపీ కులాలు, మతాలను అడ్డుపెట్టుకొని దిగజారుడు రాజకీయాలు చేస్తుందన్నారు. జాతి అనే పదం తెలియని వారు కూడా కుల గణన గురించి మాట్లాడుతున్నారని, ఎన్ని అవమానాలు ఎదురైనా పార్లమెంట్ సాక్షిగా కులగణన చేసి తీరుతానని రాహుల్ గాంధీ గారు ప్రకటించారాని పేర్కొన్నారు. గొప్పలకు పోయి ఆప్ కీ బార్... చార్ సౌ పార్... అని విర్రవీగిన బిజెపికి కనీసం 300 సీట్లు దక్కలేదని ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో కేంద్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ఆ భయంతోనే బీజేపీ చౌకబారు రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. తెలంగాణ లో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏవిధంగా అయితే కాంగ్రెస్ బలపడిందో అదేవిదంగా రానున్న రోజులలో కేంద్రంలో కూడా రాహుల్ గాంధీగారి నాయకత్వంలో కాంగ్రెస్ బలపడతు ందని ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే ఏకైక లక్ష్యంగా, రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ జెండా ఎగురావేయడమే ఎజెండగా ప్రతీ ఒక్క కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. ఒక్కో రోజు ఒక్కో రాష్ట్రంలో ఓటమి అంచున ఉన్నామనే విషయాన్నీ గ్రహించిన బీజేపీ ఉద్దేశపూర్వకంగానే ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ మైండ్ గేమ్ ఆడుతున్నారని ఆరోపించారు. దేశంలో మతాలు, కులాలతోనే కాకుండా దేవుళ్లను అడ్డుపెట్టుకొని రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూసే ఏకైక పార్టీ బీజేపీ పార్టీ అని దుయ్యబట్టారు. ఢిల్లీ బీజేపీ మాజీ ఎమ్మెల్యే తన్వీ దర్ సింగ్, మహారాష్ట్ర శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ రాహుల్? గాంధీ పై చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను ఖండిస్తున్నామని అన్నారు. బీజేపీ వెంటనే రాహుల్ గాంధీ గారికి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, రావూరి ప్రకాష్ రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కార్పొరేషన్ చైర్మన్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆలయ విశిష్టతకు భంగం వాటిల్లకుండా అభివృద్ధి పనులు

- చారిత్రక ఆనవాళ్ళు దెబ్బతినకుండా జాగ్రత్తలు
- ఆలయ పనుల పురోగతిపై మంత్రి సురేఖ సమీక్ష



**తెలంగాణ వీణ/హైదరాబాద్,సెప్టెంబర్18:** రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో చేపట్టే అభివృద్ధి పనులు దేవాలయాల ప్రాశస్త్యం, క్షేత్ర విశిష్టతకు భంగం కలగకుండా, చారిత్రక ఆనవాళ్ళు దెబ్బతినకుండా జాగ్రత్తగా చేపట్టాలని అటవీ,పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖమంత్రి కొండా సురేఖ అధికార ులను ఆదేశించారు. రాష్టంలోని ప్రముఖ దైవ క్షేత్రాలైన కీసరగుట్ట రామలింగేశ్వర స్వామి ప్రగతి, వైటిడిఎ ఆధ్వర్యంలో యాదాద్రి దేవాలయ పురోగతికి చేపడుతున్న కార్యక్రమాలు, భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్, పలు దేవాలయాల్లో సౌకర్యాల కల్పనపై సచివాలయంలో మంత్రి కొండా సురేఖ దేవాదాయశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హన్మంత రావు, వైటిడిఎ వైస్ చైర్మన్ కిషన్ రావు, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ వెంకన్న గౌడ్, డిఈఈ ఐశ్వర్య, వైటిడిఎ ఎస్టేట్ ఆఫీసర్ సంతోష్, కంచి కామకోటి వేదపాఠశాల ఛైర్మన్ గోవింద హరి, కన్జర్వేషన్ ఆర్కిటెక్ట్ సూర్య నారాయణ మూర్తి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, దేవాలయాల ప్రగతికి చేపట్టే పనులు అటవీ, దేవాదాయ, పర్యాటక, సాంస్కృతిక, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ తదితర శాఖల సమన్వయంతో ఎలాంటి ఆటంకాలు కొనసాగేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మానిటరింగ్ కమిటి నివేదిక సమర్పించిన తర్వాత యాదగిరిగుట్ట గర్భగుడి విమాన గోపురం స్వర్ణతాపడం, వేదపాఠశాల నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో గోవింద హరి ఛైర్మన్ గా రాయగిరిలో 20 ఎకరాల్లో 43 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో వేదపాఠశాలను నిర్మించనుట్లు మంత్రి సురేఖ ప్రకటించారు. సిద్ధమైన అన్నదాన సత్రాన్ని త్వరలోనే ప్రారంభించనున్నట్లు మంతి సురేఖ తెలిపారు. యాదాద్రి దేవస్థానానికి రాకపోకల నిమిత్తం ఎగ్జిట్ ఫ్లై ఓవర్ పైనే ఆధారపడిన భక్తులకు నెట్వర్క్ ఆర్చ్ బ్రిడ్జ్ గొప్ప ఉపశమనం లభించనున్నట్లు మంత్రి సురేఖ తెలిపారు.స్టీల్ తో నిర్మించనున్న 64 మీటర్ల ఈ ఫ్లై ఓవర్ ఇండియాలోనే రెండవ అతి పొడవైన బ్రిడ్జ్ కావడం తెలంగాణకు ప్రత్యేకతను తెచ్చి పెడుతుందని మంత్రి అన్నారు. 3 నెలల్లో ఈ లింకింగ్ నిర్మాణ పనులు పూర్తి చేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టేలా మంత్రి సురేఖ దిశా నిర్దేశర చేశారు. ఖచ్చితమైన ప్రణాళికతో కీసరగుట్ట దేవాలయాన్ని అభివృద్ధి చేయాలని మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. సీఎం రేవంత్ రెడ్డి సూచనల ప్రకారం రామప్ప దేవాలయం స్ఫూర్తితో కీసరగుట్ట రామలింగేశ్వర స్వామి దేవస్థానం, నాట్యమండపం, పరిసరాలను తీర్చిదిద్దాలని సూచించారు. దేవాలయం చుట్టూ ఉన్న లక్ష్మీనరసింహా, ఆంజనేయ, నాగదేవతల ఆలయాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పనులు చేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. సవరణలతో కూడిన మాస్టర్ ప్లాన్ పై సమీక్ష అనంతరం సీఎంకు సమర్పించి వెంటనే పనులను ప్రారంభించనున్నట్లు మంత్రి సురేఖ స్పష్టం చేశారు. గోదావరి నదీ తీరంలోనే భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం కొలువై ఉన్నందున నదికి వరదలు వస్తే ఆ ముంపు ప్రభావం లేకుండా పలు దశల్లో చేపట్టిన పనుల వివరాలను కన్జర్వేషన్ ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ మూర్తి వివరిం చారు. ఈ దిశగానే అభివృద్ధి పనులు చేపట్టాల్సిందిగా మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాలు, మహాపుష్కరాల సమయంలో లక్షలాదిగా వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి పనులు చేపట్టాల్సిందిగా సూచించారు. యాదగిరి గుట్టతో పాటు భద్రాచలంలోనూ పూజా కార్యక్రమాలకు పూలు, తులసి వంటి పవిత్ర పత్రాలను బయటి నుంచి కొనకుండా దేవాలయ భూముల్లోనే వాటి పెంపకం చేపట్టేలా ఉద్యానవన శాఖ సహకారం తీసుకోవాలన్నారు. దేవాలయ అభివృద్ధి పనులకు అవసరమైన భూ సేకరణ వివరాలను అధికారులు మంత్రికి వివరించారు. దేవాలయాన్ని ఆనుకుని ఉన్న రోడ్డు విస్తరణలో భాగంగా కుసుమ హరనాథ దేవాలయం దెబ్బతినే పరిస్థితులుంటంతో ప్రత్యామ్నాయ మార్గాలను మంత్రి సురేఖ సూచించారు. దీని చుట్టూ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ప్రభుత్వపరంగా అవసరమైన సహకారం అందించాలన్నారు. రాముడు దక్షిణ భారతదేశంలో తిరుగాడిన ప్రాంతాల వివరాలను వివరిస్తూ డిజిటల్ మ్యూజియం ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదించగా మంత్రి సురేఖ ఆమోదం తెలిపారు. ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు నిమిత్తం మంత్రి సీతక్కతో చర్చిస్తానని అన్నారు. అన్ని ప్రముఖ దేవాలయాల్లో ఆకర్షణీయమైన లైటింగ్, ఫౌంటెన్స్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డిసూచనల మేరకు పర్యాటకశాఖ, దేవాదయ శాఖ సంయుక్తంగా మూడు సర్క్యూట్లలో భక్తులకు విఐపి దర్శన సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు మంత్రి సురేఖ ప్రకటించారు. పైలట్ ప్రాజెక్టుగా అమలుచేస్తున్న ఈ కార్యక్రమం విజయవంతమైతే మరిన్ని రూట్లలో విస్తరిస్తామని తెలిపారు. వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కొమురవెల్లి ఒక సర్క్యూట్ గా, మన్యంకొండ, శ్రీరంగపూర్, జోగులాంబ దేవాలయం, అమ్మపల్లి దేవాలయం ఒక సర్క్యూట్ గా, డిచ్ పల్లి దేవాలయం, బాసర, కామారెడ్డిలో ప్రముఖ దేవాలయాలు ఒక సర్క్యూట్ గా భక్తులకు విఐపి దర్శన సౌకర్యాన్ని అందుబాటులోకి తెస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఈ సౌకర్యాన్ని వినియోగించుకునే భక్తుల కు సంబంధిత దేవాలయ మొమెంటో అందించి, శాలువాతో సత్కరించనున్నట్లు అధికారులు మంత్రికి స్పష్టం చేశారు. గైడ్, వీడియోగ్రాఫర్, ఫోటోగ్రాఫర్ లు విఐపి భక్తులకు సేవలందిం చనున్నట్లు కమిషనర్ హన్మంతరావు మంత్రి సురేఖకు వివరించారు.

---

# జానీ మాస్టర్‌ను కొరియోగ్రాఫర్ అసోసియేషన్ నుంచి తాత్కాలిక తొలగింపు

**తెలంగాణ వీణ/హైదరాబాద్,సెప్టెంబర్18:** కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ ను లైంగిక వేధింపుల వ్యవహారం టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో దుమారం రేపుతోంది. ఈ ఉదంతంపై ఇప్పటికే పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు. అయితే టాలీవుడ్ లో లైంగిక వేధింపుల పరిష్కార కమిటీ ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించింది. కొరియోగ్రఫీ అసోసియేషన్ అధ్యక్షుడి బాధ్యతల నుంచి జానీ మాస్టర్ ను తాత్కాలికంగా తప్పించాలని కమిటీ సిఫార్సు చేసింది. పని ప్రదేశాల్లో మహిళలకు చలన చిత్ర పరిశ్రమ ధైర్యాన్ని ఇవ్వలేక పోతుందంటూ ఆవేదన వ్యక్తం చేసింది. చిత్ర పరిశ్రమలో మహిళలు వేధింపులకు గురయితే ధైర్యంగా ఫిర్యాదు చేయ వచ్చని వారి వివరాలను గోప్యంగా ఉంచుతామంటూ స్పష్టం చేసింది. హైదరాబాద్ లోని ఫిల్మ్ ఛాంబర్ లో సమావేశమైన ఆ కమిటీ కన్వీనర్ దామోదర ప్రసాద్, చైర్ పర్సర్ ఝాన్సీ సభ్యులు తమ్మారెడ్డి భరద్వాజ,వివేక్ కూచిబొట్ల, ప్రగతి సామాజిక కార్యకర్త, రామలక్ష్మీ న్యాయవాది, కావ్య మండవలు పలు విషయాలను మీడియాకు వెల్లడించారు. సినీ ఇండస్ట్రీలో అవకాశాలు పోతాయని చాలా మంది అమ్మాయిలు తమకు జరుగుతున్న అన్యాయంపై ఫిర్యాదు చేయడానికి వెనకాడుతున్నారని అన్నారు. జానీ మాస్టర్ లైంగిక వేధింపులకు సంబంధించి ముందే బాధిత యువతి తమ కమిటీని ఆశ్రయించినట్లు వారు వెల్లడించారు. టాలెంట్ ఉన్న అమ్మాయిలకు పరిశ్రమలో ఎప్పుడూ అవకాశాలు ఉంటాయని ఝాన్సీ అన్నారు. ఈ విష యంలో బాధిత యువతికి ఓ పెద్ద నిర్మాణ సంస్థ, ఓ అగ్ర నటుడు ఛాన్స్ ఇచ్చారని తెలిపారు. అలాగే ప్రభుత్వ ఆధ్వర్యం లో గతంలో నియమించిన కమిటీ రిపోర్టు బయటకు వస్తే పటిష్టమైన మార్గద ర్శకాలు రూపొందిం చుకునేందుకు అవకాశం ఉంటుందని ఝాన్సీ తెలిపారు. గతంలో పరిశ్రమలు లైంగిక వేధింపుల కేసులు చాలా నమోదు అయ్యాయని కొన్ని తమ దృష్టి రావడం లేదని తమ్మారెడ్డి భరద్వాజా తెలిపారు. తమ కమిటీ ద్రుష్టికి వచ్చిన వాటిని పరిష్కరిస్తున్నామని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నప్పటికీ తమ వంతూ బాధ్యతగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అమ్మాయిలకు ఎదురయ్యే సమస్యలకు పరిశ్రమ భరోసా ఇవ్వక పోవడం వల్లే ఇలాంటి అఘాత్యాలకు పాల్పడు తున్నారని తమ్మారెడ్డి భరద్వాజ ఆవేదన వ్యక్తంచేశారు.



# కులగణన చేపట్టాలని, ఫీజుల బకాయిలు చెల్లించాలని బీసీ సంఘం డిమాండ్

**తెలంగాణ వీణ/జగిత్యాల, సెప్టెంబర్ 18:** కులగణన వెంటనే చేయాలని, ఫీజుల బకాయిలు వెంటనే చెల్లించాలని, ఈనెల 20వ తేదీన కలెక్టరేట్ల మరియు ఎమ్మార్వో ఆఫీస్ లో ముట్టడి చేస్తామని బిసి సంక్షేమ సంఘం హెచ్చరించింది. జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగిన బిసి సంక్షేమ సంఘం సమావేశంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పంచాయతీరాజ్/సర్పంచ్/ఎంపీటీసీ/జడ్పిటిసి తదితర స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతానికి పెంచాలని, గత మూడు సంవత్సరాల ఫీజుల బకాయిలు 4500/- చెల్లించాలని డిమాండ్ చేస్తూ,ఈనెల 20న చలో కలెక్టరేట్ మరియు మండల ఆఫీసుల ముట్టడి కార్యక్రమం జరపాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం పిలుపునిచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా ఇంతవరకు కులగణన చేయడం లేదని, ఎన్నికల వాగ్దానం ప్రకారం బీసీ రిజర్వేషన్ 42 శాతానికి పెంచడం లేదని, రాహుల్?గాంధీ ఇచ్చిన వాగ్దానం నెరవేర్చరా? దిక్కరిస్తారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల వాగ్దానం కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం పంచాయతీరాజ్, మున్సిపల్ ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. రాహుల్?గాంధీ బీసీల గురించి అనుకూలంగా మాట్లాడుతున్నారు. కానీ ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లు పెంపు గురించి మాట్లాడడం లేదనీ, అణిచివేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం 50 శాతం సీలింగ్ అని చెప్పి పెంచకుండా తప్పించుకోవడానికి వీలులేదని, ఇప్పటికీ అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లను పెట్టి 50 శాతం సీలింగ్ పై పార్లమెంటు రాజ్యాంగ సవరణ చేసిందని, అగ్రకులాలకు రిజర్వేషన్లు పెంచడానికి మూడురోజులలో లోక్?సభ, రాజ్యసభలలో రాజ్యాంగ సవరణ చేసి రాష్ట్రపతి సంతకం చేశారు కానీ 50 శాతం జనాభా గల బీద కులాలకు రాజ్యాంగ సవరణ చేయరా? మన దేశంలో బీసీలకు ఇదే న్యాయమా అని ప్రశ్నించారు. అసెంబ్లీలో చట్టం చేసి 42 శాతం పెట్టవచ్చని అభిప్రాయపడ్డారు. అవసరమైతే అన్ని పార్టీలు సహకరించడానికి సిద్ధంగా ఉన్నాయని పార్లమెంట్ రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే అన్ని పార్టీలు సహకరించడానికి సిద్ధంగా ఉన్నాయని లేకపోతే గ్రామస్థాయి నుంచి ఉద్యమిస్తామని తెలిపారు. ఒకవైపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా బహిరంగసభలలో ప్రతిరోజు కులగణనను జరుపుతామని, దాని ప్రకారం విద్యా, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లు పెంచుతామని, బడ్జెట్ కేటాయిస్తామని, బీసీ ఎజెండా ఎత్తుకొని, బీసీల అభిమానం చూరగొంటుంటే, ఇక్కడ రాష్ట్రంలో బీసీలకు అన్యాయం చేయడం తగు న్యాయమా అని ప్రశ్నించారు.గత మూడు సంవత్సరాల ఫీజుల బకాయిలు 4500 ఉన్నాయని వీటిని చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, బిసి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్, బి.సి యువజన సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుపురం రాంచందర్, బిసి సంక్షేమ సంఘం సాంస్కృతిక కార్యదర్శి బొమ్మిడి నరేష్ కుమార్, బి.సి సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మారిశెట్టి సూర్యప్రకాష్, బి.సి సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షురాలు బండపెల్లి మల్లీశ్వరి, బిసి సంక్షేమ సంఘం పట్టణాధ్యక్షుడు రాపర్తి రవి, యూత్ కో-ఆర్డినేటర్ హృషికేష్, ముద్దం గంగారెడ్డి, బిసి నాయకులు పాల్గొన్నారు.



# అజయ్ కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఓయు జెఎసి చైర్మన్ కొత్తపల్లి తిరుపతి డిమాండ్




**తెలంగాణ వీణ/నాచారం:** వైద్యం వికటించి అజయ్ అనే వ్యక్తి మరణించిన సంఘటన పిర్జాదిగూడ జేపీ హాస్పిటల్ లో చోటు చేసుకుంది. అజయ్ అనే వ్యక్తి మూడు రోజుల కిందట బాత్రూంలో జారి పడటంతో దగ్గర్లో ఉన్న జెపి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో అడ్మిట్ చేశారు. హాస్పిటల్ వైద్యులు మెదడులో రక్తం గడ్డకట్టిందని వెంటనే సర్జరీ చేయాలని చెప్పి బ్రెయిన్ సర్జరీ చేశారు, మరుసటి రోజు స్కానింగ్ చేయాలని మరొక హాస్పిటల్ తీసుకువెళ్లగా మార్గమధ్యంలో అజయ్ చనిపోయాడు దీంతో జేపీ హాస్పిటల్ వద్ద అజయ్ బంధువులు ఆందోళనకు దిగారు హాస్పిటల్ లో సరియైన వైద్యం అందగానే చనిపోయాడని అజయ్ బంధువులు ఆందోళనకు దిగారు దీంతో హాస్పిటల్ యాజమాన్యాన్ని నిలదీయగా వారు పారిపోయారు. యాజమాన్యం అజయ్ కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఓయు జెఎసి చైర్మన్ కొత్తపల్లి తిరుపతి డిమాండ్ చేశారు దీనిపైన డీఎంహెచ్ఓ కు మరియు తెలంగాణ వైద్యశాఖ మంత్రికి ఆస్పటల్ పైన ఫిర్యాదు చేసున్నట్లు తెలిపారు. గత 15 రోజుల కిందట కూడా ఒక అమ్మాయి వైద్యం వికటించి చనిపోయింది జేపీహాస్పిటల్ పైన వైద్య అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# శ్రీ వినాయక అండ్ చిల్డ్రన్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జన ఊరేగింపు..

- లడ్డూ వేలం పాటలో 18100 వేలకు గణేష్ లడ్డూను దక్కించుకున్న దేవేందర్ రెడ్డి..





**తెలంగాణ వీణ/నాచారం:** శ్రీ వినాయక అండ్ చిల్డ్రన్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాచారంలోని అన్నపూర్ణ కాలనీలో ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు.బుధవారం సాయంత్రం విఘ్నేశ్వరునికి ప్రత్యేక నైవేద్యాలు ప్రసాదాలు సమర్పించి స్వామికి హారతి ఇచ్చి అంతా మంచి జరగాలని వేడుకున్నారు కాలనీ మహిళలు.విఘ్నేశ్వరుని లడ్డూ వేలం పాట లో 18100 వేలకు గణేష్ దక్కించుకున్న దేవేందర్ రెడ్డి కుటుంబ సభ్యులు..కమిటీ వారు శాలువాతో ఘనంగా సన్మానించి దేవేందర్ కి గణపతి మహా ప్రసాదం లడ్డూను అందజేశారు.. అనంతరం గణపతి ప్రాంగణ ఆవరణలో ఉట్టి కొట్టి సందడిచేసిన చిన్నారులు..గణేష్ నిమజ్జన ఊరేగింపు బ్యాండు మేళలతో డ్యాన్స్ చేస్తూ జై బోలో గణేష్ మహా రాజ్‌కి జై అంటూ నిమజ్జనం చేశారు.కమిటీ సభ్యులు..టి వేణు కుమార్,అజయ్,మురళీ కృష్ణ,దేవేందర్ రెడ్డి,విఠల్ యాదవ్, కాలనీ మహిళలు టి రత్న కుమారి,కాంచన, జ్యోతి, ప్రమీల, వినోద,రేణుకా,నవ్య,బాలమని, ఉష,రమలు పాల్గొన్నారు.



గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జన ఊరేగింపుగా భారీగా తరలివస్తున్న గణపతి రథాలు భక్తులకు స్వాగతం పలికిన బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్..

- తెలంగాణ వీణ/నాచారం:



# తార్నాకలో జాక్వార్ షోరూం..

**- ప్రారంభించిన షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద గుప్తా, డాక్టర్ పెండ్యాల హరినాథ్ బాబు....**

**తెలంగాణ వీణ/తార్నాక:** సికింద్రాబాద్ నియోజకవర్గం తార్నాక లోని రమేష్ ట్రేడర్స్ లో నూతనంగా ఏర్పాటు చేసిన జాక్వార్ షోరూం(కంప్లీట్ బాత్రూం సొల్యూషన్స్)ను బుధవారం ముఖ్య అతిథులుగా ఎస్సీ ఎస్టీ ఓబీసీ మైనార్టీ అఫైర్స్ అడ్వైజర్ మహ్మద్ షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్ గుప్తా, రెండు తెలుగు రాష్ట్రాల జాక్వార్ షోరూం ఇన్చార్జి డాక్టర్ పెండ్యాల హరినాథ్ బాబు, బ్రాంచ్ హెడ్డ్ అభిజిత్ సింగ్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ నాణ్యత మన్నిక స్పెషల్ అట్రాక్షన్ ఉన్నవాటికి కస్టమర్స్ మొగ్గు చూపుతున్నారని తెలిపారు. మారుతున్న ట్రెడిషనల్ కు అనుగుణంగా కొత్త ఓరువడులతో ముందుకు రావాలని సూచించారు. యువత చదువుకొని ఉద్యోగం వైపు చూడకుండా బిజినెస్ పెట్టి ఉపాధి కల్పించడం గొప్ప



విషయమని ప్రొప్రైటర్ రాధాకృష్ణను కొనియాడారు. ఎమ్మెల్సీ దయానంద్ గుప్త మాట్లాడుతూ కస్టమర్స్ ఆలోచన తగ్గట్టుగా షోరూమ్ లు నెలకొల్పాల్సిన అవసరం ఉందన్నారు. జాక్వార్ ఇంచార్జ్ డాక్టర్ పెండ్యాల హరినాథ్ బాబు మాట్లాడుతూ జాక్వార్ కంప్లీట్ బాత్రూం సొల్యూషన్స్ పట్ల కస్టమర్ పెరుగుతున్నారని దానికి తగ్గట్టుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో మరిన్ని బ్రాంచీలు



ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తార్నాక జాక్వార్ కంప్లీట్ బాత్రూం సొల్యూషన్స్ షోరూం ప్రొప్రైటర్ రాధాకృష్ణ మాట్లాడుతూ నూతన గృహాలకు అవసరమైన కస్టమర్స్‌కు తగ్గట్టుగా జాక్వార్ కంప్లీట్ బాత్రూం ఐటమ్స్ పరిచయం చేస్తున్నామని, నాణ్యత మన్నిక అధికంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్ ట్రేడర్స్ ప్రొప్రైటర్ రమేష్ తోపాటు డిస్ట్రిబ్యూటర్స్ కస్టమర్స్ తదితరులు పాల్గొన్నారు.

---

# ఓయూలో డి.బి.ఎస్.ఏ ,భీం డ్రమ్ ఆధ్వర్యంలో పెరియార్ 145 వ జయంతి సభ


**తెలంగాణ వీణ/ఓయూ:** డి.బి.ఎస్.ఏ ,భీం డ్రమ్ ఆధ్వర్యంలో ఆత్మగౌరవ హక్కుల ఉక్కు పిడికిలి,మానవత్వపు మట్టి పరిమళం ,ద్రావిడ సాంస్కృతిక పోరాట యోధుడు సందర్భంగా ఓయూ ఆర్ట్స్ కాలేజ్ నుండి లా కాలేజ్ వరకు నల్ల చొక్కాలతో ర్యాలి నిర్వహించి,అనంతరం ఓయూ ఆర్ట్స్ కాలేజ్ రూమ్ నంబర్ 57 లో సభ ను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సభకు డి.బి.ఎస్.ఏ ,భీం డ్రమ్ వ్యవస్థపాక అధ్యక్షులు డా.నలిగంటి శరత్ చమార్ అధ్యక్షత వహించి పెరియార్ నువ్వు మనువాదుల గుండెల్లో రివాల్వర్ ,పెరియార్ నీకు బహుజనులందరి జోహార్లు అంటూ, ఈ దేశ మూలవాసుల చరిత్ర, నాగరికత రక్షించడంలో దళిత బహుజన ప్రజలు, విద్యార్థులు, మేధావుల, కళా నాయకులు, జ్ఞాన నాయకులు ముందు వుండలని నలిగంటి శరత్ చమార్ పేర్కొన్నారు.ప్రొపెసర్ కంచె మాట్లాడుతూ పెరియార్ జీవితాన్ని, పోరాటం గుర్తుకు చేస్తూ, హరప్ప నాగరికత మూలాలు, గొప్పతనం గురించి చేప్పాడు, నాగరికతకు మూలం నాగలి, ఈ దేశ అభివృద్ధి మొత్తం దళిత బహుజన ప్రజలు, చమట రక్తంతోనే




నిర్మిచబడినది.ముమ్మాటికీ ద్రావిడ చరిత్ర, సంస్కృతినీ కాపాడండి, బర్రె జాతీయ జంతువు, కాకీ జాతీయ పక్షి గొప్ప లక్షణాలు గురించి చెప్పాడు, పెరియార్ జయంతినీ నేషనల్ సోషల్ జస్టిస్ డే చేయాలి పేర్కొన్నారు దళితులు, బహుజనులు మేధావుల అందరు ఇంగ్లీష్ లో రచన చేయాలి ఆర్య బ్రాహ్మణ కుట్రలు బద్దలు కొట్టి, ఈ దేశాన్ని, రాజ్యాంగంను రక్షించాలి అని కంచె ఐలయ్య పేర్కొన్నారు. వక్తలు ప్రో. కంచే ఐలయ్య,వేముల ఎల్లన్న, విమలక్క, దాసోజు లలిత,ప్రో.రామ్ షెఫర్డ్, బొర్రా అరుణ్ అంబేద్కర్ ,రామంచ భరత్ అందే భాస్కర్ ,సురేష్ మహాజన మేడే శాంతి కుమార్ ,గాదె వెంకట్, హాజరై ప్రసంగించారు.ఈ కార్యక్రమాన్ని డి.బి.ఎస్.ఏ రాష్ట్ర కో ఆర్డినేటర్ జంగిలి దర్శన్ సమన్వయం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో డి.బి.ఎస్.ఏ రాష్ట్ర కో ఆర్డినేటర్ జంగిలి దర్శన్,డి.బి.ఎస్.ఏ స్పోక్స్ పర్సన్ కాసర్ల మధు,డి.బి.ఎస్.ఏ వరంగల్ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ చిన్నా,డి.బి.ఎస్.ఏ ఓయూ ప్రెసిడెంట్ సమీర్,డి.బి.ఎస్ ఏ సోషల్ మీడియా దారమల్ల రమేష్,సతీష్,మరియు ఓయూ విద్యార్థి సంఘాల నాయకులు కంచర్ల బద్రి, వలిగొండ నర్సింహ,కొంగల పాండు,శ్రీనివాస్ యాదవ్,ఉదయ్, సుమంత్, వేదాంత్ మౌర్య, తాళ్ల అజయ్,నవీన్,అమర్,టోనీ బిక్కల్,తదితరులు పాల్గొన్నారు.

---

## నూతనంగా నిర్మించిన సఫిల్గుడా రైల్వే స్టేషన్ భవనాన్ని ప్రారంభం: ఎంపీ ఈటెల, ఎమ్మెల్యే మర్రి






**తెలంగాణ వీణ/మల్కాజ్గిరి:** మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ,పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ తో కలసి నూతంగా నిర్మించిన సఫిల్ గూడ రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా మల్కాజిగిరి నియోజక వర్గ సమగ్ర అభివృద్ధికి నా వంతు కృషి చేస్తాను. రైల్వే అధికారుల దృష్టికి ఇదివరకే పలు సమస్యల పరిష్కారం కోసం సంప్రదించాను, పార్లమెంటు సభ్యులు అనుభవజ్ఞులైన ఈటెల రాజేందర్ సహకారంతో మున్ముందు నియోజక వర్గ అభివృద్ధికి కలసి పనిచేస్తాంఅని తెలిపారు.ప్రాజెక్టు ఖర్చు2.23 కోట్లు.బిల్డింగ్ ఖర్చు 1.86 కోట్లు. కార్పొరేటర్లు సునీత రాము యాదవ్,శ్రవణ్, రాజ్యలక్ష్మి, రాము యాదవ్, DRM విష్ణోయి తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి గిరి ప్రదక్షిణ చేసే భక్తులకు సౌకర్యార్థం 2లక్షలచే 33 సిమెంట్ కుర్చీ బల్లలు బహుకరించిన డా.పద్మ







**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:**రోటరీ క్లబ్ ఆఫ్ యాదగిరిగుట్ట ఆధ్వర్యంలో డా. పద్మజా సంతాన సాఫల్య కేంద్రం, హబ్సిగూడ హైదరాబాద్ సౌజన్యంతో యాదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం గిరి ప్రదక్షణ కోండ చుట్టూ ఉన్న దారిలో భక్తుల సౌకర్యార్థం రూ. 2,00,000 విలువ గల 33 సిమెంట్ బెంచీలను ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో డా. ఏంపల్ల బుచ్చిరెడ్డి చైర్మన్ న్యూ క్లబ్స్ జోన్ నెంబర్ ..(3, 3150) రోటరీ జిల్లా, క్లబ్ అధ్యక్షులు దీకొండ వెంకటేష్, భువనగిరి క్లబ్ మాజీ అధ్యక్షులు గడ్డం జ్ఞాన ప్రకాష్ రెడ్డి, భువనగిరి క్లబ్ అధ్యక్షులు ఎండి అనిప్ మేమన్, క్లబ్ కార్యదర్శి కైరం కొండ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన ఎమ్మెల్యే ఐలయ్య..

**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలన్న.ఇట్టి సహకారానికి సహకరించిన యాదగిరిగుట్ట కొండపైకి నడుచు ఆటో యూనియన్ అధ్యక్షులు గుండు నరసింహ గౌడ్ అధ్యక్షులు గుండు సాయిలు గౌడ్ బాకీ మొగులయ్య గడ్డమీద దేవేందర్ గౌడ్ గుండు సంతోష్ గౌడ్ కంసాని శ్రీహరి తుమ్మల ఇస్తారి గోర్క నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# అవినీతి, అక్రమాలకు సింగరేణిలో స్థానం లేదు...

**- అవినీతి నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలి**



**తెలంగాణవీణ/హైదరాబాద్:** అన్ ఫిట్ చేయిస్తామని అక్రమాలకు పాల్పడే వారి సమాచారం ఇస్తే 10 వేల నజరానానాణ్యత పాటించని అధికారులు, కాంట్రాక్టర్లు, ఏజెన్సీ లపై కూడా కఠిన చర్యలువిజిలెన్స్ విభాగంపై సమీక్షలో సంస్థ సీఎండీ ఎన్ బలరామ్ స్పష్టీకరణసింగరేణి ఆస్తుల పరిరక్షణకు హైడ్రా తరహా చర్యలు ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి ఆస్తులు, క్వార్టర్లను పరిరక్షించడం అందరి బాధ్యత అని సీఎండీ శ్రీ ఎన్.బలరామ్ చెప్పారు. దీన్ని కాపాడుకోవడానికి ప్రతీ ఒక్క ఉద్యోగి కృషి చేయాలన్నారు. సింగరేణి ఆస్తులు, క్వార్టర్ల పరిరక్షణకు హైడ్రా తరహా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కొత్తగూడెం నుంచి జీఎం(విజిలెన్స్) శ్రీ ప్రసాదరావు, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

## గణనాధుని నిమజ్జనోత్సవాల్లో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు



**తెలంగాణ వీణ/తార్నాక:** వినాయక నిమజ్జనం ఉత్సవాల్లో భాగంగా తార్నాక డివిజన్ మాణికేశ్వర్నగర్లో నిర్వహించిన గణనాథుని ఉత్సవాల్లో డీసిసి ప్రధాన కార్యదర్శి వరికుప్పల రవి పాల్గొని వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రవిని శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆనంతరం బుధవారం ఉదయం నిమజ్జనానికి గణనాథున్ని తరలించారు. నిమజ్జనం ర్యాలీ పొడవునా యువకులు ఆడుతూ పాడుతూ గణనాథున్ని సాగనంపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గండికోట విజయ్కుమార్, ఓర్సు శేఖర్. రాజేష్, నర్సింగ్, మహేందర్. అదేష్, నరేష్ తదితరులున్నారు.

## ఘనంగా గణేష్ నిమజ్జన ఉత్సవం..



**తెలంగాణ వీణ/తార్నాక:** లాలాపేట్ వినోభానగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జనం వేడుకలను ఘనంగా నిర్వహించారు. వినోభానగర్ నుంచి గణనాథున్ని భాజీ భజంత్రీలతో బస్తీలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షులు స్వామి, ప్రధాన కార్యదర్శి పరమేష్, కోశాధికారి ప్రసాద్, అశోక్, వికాస్, కిరణ్కుమార్, భద్రయ్య, సాయిబాబ, శ్రీనివాస్ తదితరులున్నారు. అనంతరం కాప్రా చెరువులో వినాయకున్ని నిమజ్జనం చేశారు.

## ఎల్ఓసి చెక్కు అందజేసిన ఎమ్మెల్యే



**తెలంగాణవీణ/కూకట్ పల్లి:** కూకట్ పల్లి క్యాంపు కార్యాలయంలో ,కూకట్ పల్లి డివిజన్, దయార్ గూడా కు చెందిన బి.రమీలా అనారోగ్యంతో సి .యం. రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకోగా, సి ఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరు అయిన రూపాయలు ఒక లక్షా పది వేల విలువ గల ఎల్ ఓ సి చెక్కును కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ అందజేశారు.

## సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్

**తెలంగాణవీణ/కూకట్ పల్లి:** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని జయనగర్ కాలనీలోని కమాన్, టి జంక్షన్ వద్ద పదహారు లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. రోడ్డును లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఇ శ్రావణి, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, విష్ణు, వెంకట్ రెడ్డి, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.



## నారాయణ పాటశాలలో ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే వేడుక



**తెలంగాణ వీణ/నాచారం:** నారాయణ పాటశాలలో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా నాగర్ కర్నూల్ రిటైర్స్ ఎమ్ఆర్వో శేబి అశోక్, నారాయణ. జి.యం గోపాల్ రెడ్డిగారు, ఎజియం బాల పరమేశ్వర్, ప్రధానోపాధ్యాయులు, కో ఆర్డినేటర్స్ విచ్చేసి ఈ వేడుకను ప్రారంభించారు.. ఈ వేడుకలో విద్యార్థుల అమ్మమ్మలు, నానమ్మలు తాతయ్యలు పాల్గొన్నారు. ఈ వేడుకలో బాగంగా గ్రాండ్ పేరెంట్స్‌కి వివిధ ఆటలపోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి ప్రశంశాపత్రాలను, పతకాలను, మొక్కలను అందజేసారు. గ్రాండ్ పేరింట్స్ డే ను పురస్కరించుకొని విద్యార్థులు బోడుప్పల్ లో ఉన్న సహృదయ వృద్దాశ్రమానికి వెళ్లి వృద్ధులకు పళ్ళు, బిస్కెట్లు, బ్రెడ్ ప్యాక్లు ఆహారధాన్యాలను అంద జేశారు. పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడం తమకు ఎంతో ఆనందదాయకంగా ఉందని ఈ వేడుకకు విచ్చేసిన గ్రాండ్ పేరెంట్స్ తెలిపారు.

## ప్రత్యేక పూజలందుకుంటున్న లాలాపేట్ వినోబా నగర్ వెల్ఫేర్ కమిటీ గణనాథుడు






**తెలంగాణ వీణ/హైదరాబాద్:** లాలాపేట్ వినోబా నగర్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఘననాధుడు నిమజ్జనానికి తరలి వెళ్లారు. గణనాధుని ఏసిపి జైపాల్ రెడ్డి ఎస్సై నాగరాజు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు ఈ సందర్భంగా మండప నిర్వాహకులు వారిని ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వినోబా నగర్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులు స్వామి కార్యదర్శి పరమేష్ కోశాధికారి బి.దేవి ప్రసాద్ సంయుక్త కార్యదర్శులు జి. అశోక్, ఆర్ వికాస్, ఉపాధ్యక్షులు మిట్టపల్లి రాజు, బి.ఆర్ కిరణ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సాయిబాబా, టి. శ్రీధర్, వై. వినోద్, మహేష్, ప్రదీప్ కుమార్ తో పాటు పలువురు బస్తీ వాసులు పాల్గొన్నారు.

## ఆలేరు పట్టణంలో పలు కుటుంబాలను పరామర్శించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:** ఆలేరు పట్టణంలో కర్రే రాములు అనారోగ్యంతో మృతిచెందగా వారికి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.పట్టణానికి చెందిన జనం న్యూస్ రిపోర్టర్ జాంగిర్ సతీమణి గుండె పోటుతో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు.ఆలేరు పట్టణానికి చెందిన కాసుల బాధ హరిబాబు అనారోగ్యంతో మృతి చెందగా అతని కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.



# నిరుపేద కుటుంబంకు పెళ్లి ఖర్చులు కోసం ఆర్థిక సహాయం

- కాంగ్రెస్ నాయకులు పిట్టల నాగరాజు



**తెలంగాణ వీణ/మల్కాజ్గిరి:** మానవసేవయే మాధవసేవ , మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సేవా బాటలో , నేను సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు మల్కాజిగిరి కాంగ్రెస్ నాయకులు పిట్టల నాగరాజు తెలిపారు. బుధవారం మైనంపల్లి హనుమంతరావు సూచనలు మేరకు కాప్రా సాయి బాబా కాలనీలో నివాసం ఉంటున్న ఒక నిరుపేద కుటుంబానికి పెళ్లి ఖర్చులు నిమిత్తం, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారి కుటుంబ సభ్యులు ద్వారా తెలుసుకుని, ఆ కుటుంబానికి 10000 ఆర్థిక సహాయం మల్కాజిగిరి కాంగ్రెస్ నాయకులు పిట్టల నాగరాజు వారికి అందజేశారు. ఈ సందర్భంగా పిట్టల నాగరాజు మాట్లాడుతూ మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి ఆదుకునే సేవ తత్వం, ఆయన బాటలోనే మేము సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. గతంలో స్కూలు విద్యార్థులకు , నోట్ పుస్తకాలు బ్యాగులు, పెన్నులు అందజేశామన్నారు. ఇంకా పేదలకు సేవా కార్యక్రమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు.



## నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

**తెలంగాణ వీణ/మల్కాజ్గిరి:** సఫీల్ గుడా చౌరస్తాలో వినాయక నిమజ్జనం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్టేట్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు.. ఈ సందర్భంగా నిమజ్జనానికి వస్తున్న గణపతులను స్వాగతం పలికారు .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ విచ్చేసి స్వాగతం పలికారు .ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ బీ బ్లాక్ అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్ జి ఎన్ వి సతీష్ కుమార్ పిట్టల శ్రీనివాస్ గుండా నిరంజన్ రాందాస్ సంతోష్ ముదిరాజ్ జీడి సంపత్ గౌడ్ వైనాల ప్రవీణ్, పంజా శ్రీనివాస్ యాదవ్ వినోద్ యాదవ్ చెన్నారెడ్డి ఎస్ ఆర్ ప్రసాద్ బాబు సత్యనారాయణ ఉమేష్ సింగ్ సురేష్ సింగ్ కన్నె మల్ల నాగరాజు ధర్మేష్ యాదవ్ సందీప్ గౌడ్ రఘు యాదవ్ చంకు శ్రీనివాస్, వెంకటేశ్వరరావు పిట్టల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# యాదాద్రి నృసింహుడు హుండీ ఆదాయం 2కోట్ల 98లక్షలు..





**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:** ప్రతినిధి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ హుండీ ఆదాయం 2,98,48,233/- బుధవారం ఉదయం నుండి హుండీ లెక్కింపు ప్రక్రియ కొండ క్రింద సత్యనారాయణ వ్రత మండపం ఆవరణలో సీసీ కెమెరాలు పర్యవేక్షణలో ఈఓ భాస్కరరావు ప్రారంభించారు.రెండు కోట్ల తొంబై ఎనిమిది లక్షల నలభై ఎనిమిది వేల రెండు వందల ముప్పై మూడు నగదు కానుకల రూపంలో వచ్చిన ధనాన్ని దేవస్థాన దానగరంలో బద్రపరిచమని ఆలయ ఈఓ భాస్కరరావు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నరసింహమూర్తి ,ఈఓ భాస్కరరావు,,సిబ్బంది,పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## భజరంగి యూత్ అసోసియేషన్ భారీ గణేష్ నిమజ్జన ఉత్సవం..



**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:** భజరంగీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జన ఊరేగింపు ఘనంగా నిర్వహించారు..యాదగిరిగుట్ట పాత గుండ్లపల్లి లో యూత్ సభ్యులు మహిళలు ఓకే డ్రెస్ కోడ్ తో స్టెప్పులు వేస్తూ సందడి చేశారు.. చిన్న పెద్ద తారతమ్యం లేకుండా అందరూ కలిసి దాండియా కోలాటం ఆడుతూ పాడుతూ వినాయక నిమజ్జనం వైభవంగా నిర్వహించారు.

## మానవత్వం చాటుకున్న కాంగ్రెస్ నేత గుండా నిరంజన్

**తెలంగాణ వీణ/మల్కాజిగిరి:** మానవత్వం చాటుకున్న , తన తోటి కార్యకర్త తల్లి మరణంతో మానవత్వంతో ఆర్థిక సహాయం చేసినట్లు మల్కాజిగిరి మీడియా కన్వీనర్ గుండా నిరంజన్ తెలిపారు... మల్కాజిగిరి చెందిన కాంగ్రెస్ కార్యకర్త అశోక్ తల్లి యాదమ్మ మరణంతో, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి ఆదేశాల మేరకు మృతురాలి కుమారుడికి 10000 ఆర్థిక సహాయం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు క్యాంపు కార్యాలయంలో మల్కాజిగిరి మీడియా కన్వీనర్ గుండా నిరంజన్ అందజేశారు



## ప్రశాంతంగా వినాయక నిమజ్జనం



**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:** రాజపేట మండలం రఘునాథపురం గ్రామంలో గ్రీన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి వినాయక నవరాత్రి ఉత్సవాల్లో యాదాద్రి ఏసిపి రమేష్ సార్ మరియు రాజపేట ఎస్సై ఉపేందర్ యాదవ్ మరియు ఏఎస్ఐ ఎస్ఐ ప్రకాష్ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన జరిగింది ఎసిపి రమేష్ మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ కూడా నిమజ్జనం కార్యక్రమంలో ప్రశాంతంగా అహ్లాదకరమైన వాతావరణంలో భక్తిశ్రద్ధలతో యొక్క నిమజ్జనం కార్యక్రమం పాల్గొనాలి అందరు కూడా బాగుండాలని వారు కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రీన్ యూత్ సభ్యులు మరియు గ్రామ ప్రజలు యువకులు పెద్ద ఎత్తున అందరూ హాజరయ్యారు బల్లయాదేశ్ బల్ల మురళి బింగి బాలరాజు బత్యం బాలరాజు గంజి పాండు మహేష్ కిరణ్ కుమార్ పవన్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



6 9 TV తెలుగు
తెలంగాణ వీణ
For Advertisements
8328209811
Flat No 204,
Mythri Appartments,
Opp BSNL Office, ECIL

# బంగ్లాతో టెస్ట్ సిరీస్ ఉచితంగా ఇలా చూసేయండి!



ప్రారంభం కానుంది. ఆ తర్వాత సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 1 మధ్య రెండో టెస్ట్ కాన్పూర్ వేదికగా జరగనుంది. ఇక ఈ సిరీస్ కోసం టీమిండియా గట్టిగా రెడీ అవుతోంది. బంగ్లాను అంత ఈజీగా తీసుకోబోమని, మా ప్లాన్స్ మాకున్నాయని వాటితోనే ప్రత్యర్థిని చిత్తు చేస్తామని టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ వార్నింగ్ ఇచ్చాడు. అదీకాక ఈ సిరీస్ లో విజయం సాధించి.. టెస్ట్ సీజన్ ను ఘనంగా ఆరంభిస్తామని హిట్ మ్యాన్ మీడియా సమావేశంలో

టీమిండియా రెస్ట్ మోడ్ నుంచి బయటకి వచ్చి.. బంగ్లాదేశ్ తో టెస్ట్ సిరీస్ కోసం గ్రౌడ్ లోకి దిగింది. నెలన్నర విశ్రాంతి తర్వాత టీమిండియా ఆటగాళ్లు ప్రాక్టీస్ ప్రారంభించారు. చెన్నైలోని చెపాక్ స్టేడియంలో కఠోరంగా సాధన చేస్తున్నారు. మరోవైపు పాక్ ను ఓడించిన ఉత్సాహంతో.. టీమిండియాను కూడా ఓడిస్తామని ధీమా వ్యక్తం చేశాడు ప్రత్యర్థి కెప్టెన్. ఇక ఈ కామెంట్స్ కు మాటలతో కాదు, చేతలతోనే బదులిస్తామని రోహిత్ శర్మ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చాడు. ఇదిలా ఉండగా.. ఈ సిరీస్ హాట్ స్టార్ లో ప్రసారం కాదు. మరెలా చూడాలి? అని ఫ్యాన్స్ అనుకుంటున్నారు. ఇక ఈ సిరీస్ ను ఫ్రీగా ఎక్కడ చూడాలో ఇప్పుడు తెలుసుకుందాం పదండి. భారత్ వర్సెస్ బంగ్లాదేశ్ మధ్య సెప్టెంబర్ 19 నుంచి టెస్ట్ సిరీస్ స్టార్ట్ కాబోతోంది. చెన్నై చెపాక్ స్టేడియం వేదికగా తొలి టెస్ట్

వెల్లడించాడు. మరోవైపు బంగ్లా కెప్టెన్ కూడా పాక్ ను ఓడించినట్లుగానే భారత్ ను ఓడిస్తామని ధీమాను వ్యక్తం చేశాడు. కాగా.. ఈ సిరీస్ హాట్ స్టార్ లో ప్రసారం కాదు. దాంతో ఈ మ్యాచ్ లు ఎక్కడ చూడాలా? అని క్రికెట్ లవర్స్ అనుకుంటున్నారు. ఇక ఫ్రీగా ఈ సిరీస్ ను ఇక్కడ చూసేయండి. ఆ వివరాలు ఇప్పుడు చూద్దాం.. భారత్ వర్సెస్ బంగ్లాదేశ్ సిరీస్ కు అధికారిక బ్రాడ్ కాస్టర్స్ గా రిలయన్స్ సంస్థకు చెందిన జియో సినిమా, స్పోర్ట్స్ 18 లు వ్యవహరిస్తున్నాయి. స్పోర్ట్స్ 18 సాటిలైట్ ఛానల్ లో ఈ మ్యాచ్ ల ప్రత్యక్ష ప్రసారాన్ని చూడొచ్చు. అయితే ఈ ఛానల్ ను సబ్ స్క్రైబ్ చేసుకోవాలంటే డబ్బులు చెల్లించాల్సి వస్తుంది. కానీ ఇలా డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేకుండా ఫ్రీగా చూసేయ్యొచ్చు. ప్రముఖ ఓటీటీ ఫ్లాట్ ఫామ్ జియో సినిమాలో ఈ సిరీస్ ను ఫ్రీగా చూడొచ్చు.

# శుభ్ మన్ గిల్‌కు గేమ్ పల్స్ తెలుసు : ఆకాశ్ చోప్రా



టీమిండియా ప్లేయర్ శుభ్ మన్ గిల్ పై మాజీ ప్లేయర్ ఆకాశ్ చోప్రా ప్రశంసలు కురిపించాడు. క్రికెట్ గురించి గిల్‌కు అద్భుతమైన అవగాహన ఉందని, రానున్న కాలంలో అతడు ప్రపంచ క్రికెట్‌లో పెద్ద ఆటగాడిగా మారతాడని పేర్కొన్నాడు.'శుభ్‌మన్ గిల్ కు గేమ్ పల్స్ తెలుసు. అదే అతడి బిగ్గెస్ట్ క్వాలిటీ. గేమ్ పల్స్ ను కొందరు ప్లేయర్లు తొందరగా గ్రహిస్తే.. మరికొందరు ఆలస్యంగా అర్థం చేసుకుంటారు. మీరు గొప్ప ఆటగాళ్లను చూడండి వారు తొందరగా గేమ్ పల్స్ ను పట్టేస్తారు. విరాట్ కోహ్లీ చాలా త్వరగా గేమ్ పల్స్‌ను అర్థం చేసుకున్నాడు. మహేంద్ర సింగ్ ధోనీ వన్డేల్లో బ్యాటింగ్ పల్స్‌ను తొందరంగా తెలుసుకున్నాడు. శుభ్‌మన్ గిల్ కూడా తెలివైన వాడు. ఆట ఏ దిశగా సాగుతుందో వంద శాతం అర్థం చేసుకుంటున్నాడు. పరిస్థితులకు తగ్గట్టుగా ఎలా ఆడాలో అతనికి బాగా తెలుసు' అని ఆకాశ్ చోప్రా వివరించాడు.

# టెస్టుల్లో అరుదైన ఫీట్‌కు చేరువలో జడేజా



టెస్టుల్లో ప్రపంచ నంబర్‌వన్ ఆల్‌రౌండర్‌గా కొనసాగుతున్న రవీంద్ర జడేజా ( .. టెస్ట్ ఫార్మాట్‌లో రెండు రికార్డులపై కన్నేశాడు. ఈ స్పిన్నర్ మరో ఆరు వికెట్లు పడగొడితే టెస్టుల్లో 300 వికెట్ల ఫీట్ ను అందుకుంటాడు. దీంతో భారత్ తరఫున ఈ ఘనత సాధించిన ఏడో బౌలర్‌గా రికార్డుల్లోకెక్కుతాడు. ప్రస్తుతం ఈ క్లబ్‌లో అనిల్ కుంబ్లే (619), అశ్విన్ (516), కపిల్ దేవ్ (434), హర్భజన్ సింగ్ (417), ఇషాంత్ శర్మ (311), జహీర్ ఖాన్ (311) ఉన్నారు. ఆరు వికెట్లు సాధిస్తే జడేజా మరో రికార్డునూ అందుకోనున్నాడు. టెస్టుల్లో 3 వేల కంటే ఎక్కువ రన్స్ చేయడంతో పాటు 300 వికెట్లు సాధించిన మూడో భారత క్రికెటర్‌గా నిలవనున్నాడు. కపిల్ దేవ్ (5,248 రన్స్), అశ్విన్ (3,309 రన్స్) ఇప్పటికే ఈ జాబితాలో ఉన్నారు. బంగ్లాదేశ్‌తో జరగనున్న రెండు టెస్టుల సిరీస్‌కు ఎంపికైన రవీంద్ర జడేజా ఇప్పటివరకు 72 టెస్టులు ఆడి బ్యాటర్‌గా 3,036 రన్స్, బౌలర్‌గా 294 వికెట్లు సాధించాడు. సెప్టెంబరు 19 నుంచి బంగ్లాదేశ్‌తో జరిగే తొలి టెస్టులో జడేజాకు తుది జట్టులో చోటు దక్కడం దాదాపు ఖాయమైంది.

# మహిళా టీ20 వరల్డ్ కప్ ప్రైజ్ మనీ రూ.66 కోట్లు

మహిళల టీ20 వరల్డ్ కప్ ప్రైజ్ మనీ విషయంలో ఐసీసీ కీలక నిర్ణయం తీసుకుంది. వరల్డ్ కప్ లో మెన్స్ క్రికెటర్లతో సమానంగా మహిళా క్రికెటర్లకు ప్రైజ్‌మనీ అందిస్తామని ప్రకటించింది. వచ్చే నెల జరగనున్న మహిళల టీ20 ప్రపంచకప్ నుంచే ఈ కొత్త విధానం అమలులోకి వస్తుందని పేర్కొంది. ఈ నిర్ణయంతో టోర్నమెంట్ ఛాంపియన్‌గా నిలిచిన టీమ్ రూ.19 కోట్ల ప్రైజ్‌మనీ దక్కించుకోనుంది. గత టీ20 ప్రపంచకప్ ప్రైజ్‌మనీతో పోలిస్తే ఇది 134 శాతం అధికం. రన్నరప్‌గా నిలిచిన టీమ్ కు రూ.9 కోట్ల క్యాష్? ప్రైజ్ అందుకుంటుంది. సెమీ ఫైనల్‌లో ఓడిన రెండు టీమ్స్ కు గతంలో 2,10,000 అమెరికన్ డాలర్లు ఇవ్వగా.. ఇప్పుడు దానిని 6,75,000 అమెరికన్ డాలర్లకు పెంచారు. మొత్తం ప్రైజ్‌మనీ 7,958,080 అమెరికన్ డాలర్లు (రూ.66 కోట్లు). గతంతో పోలిస్తే ఇది 225 శాతం అధికం. మహిళల టీ20 వరల్డ్ కప్ అక్టోబర్ 3 నుంచి 20 వరకు యూఏఈ వేదికగా జరగనుంది. అయితే, వరల్డ్ కప్ బంగ్లాదేశ్? లో జరగాల్సి ఉండగా.. అక్కడ కల్లోల పరిస్థితుల నేపథ్యంలో ఐసీసీ యూఏఈకి వేదికను మార్చింది. మొత్తం 10 టీమ్స్ ను రెండు గ్రూప్ లుగా డివైడ్ చేశారు. గ్రూప్ లోని ప్రతి టీమ్ ఇతర టీమ్ తో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. ప్రతి గ్రూప్ నుంచి టాప్2లో నిలిచిన టీమ్స్ సెమీఫైనల్ కు చేరుతాయి. గ్రూప్ – ఏలో భారత్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, పాకిస్థాన్, శ్రీలంక.. గ్రూప్ బిలో సౌతాఫ్రికా, ఇంగ్లాండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, స్కాట్లాండ్‌ఉ న్నాయి. భారత్ అక్టోబర్ 4న న్యూజిలాండ్, 9న శ్రీలంక, 13న ఆస్ట్రేలియాతో ఆడుతుంది. భారత్ – పాక్ మ్యాచ్ అక్టోబర్ 6న దుబాయ్‌లో జరగనుంది.

# సీనియర్ ఆల్‌రౌండర్‌కు షాక్.. బంగ్లాదేశ స్క్వాడ్‌లో యువరక్తం



మహిళల టీ20 వరల్డ్ కప్ కోసం బంగ్లాదేశ్‌స్క్వాడ్‌ను ప్రకటించింది. ఆసియా కప్‌లో జట్టును నడిపించిన నిగర్ సుల్తానా కెప్టెన్‌గా 15 మందితో కూడిన బృందాన్ని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఎంపిక చేసింది. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే..? ఈసారి యువ రక్తంతో కూడిన స్క్వాడ్‌ను యూఈఏకి పంపాలని బీసీబీ సెలెక్టర్లు నిర్ణయించుకున్నారు. అందులో భాగంగానే వెటరన్ ఆల్‌రౌండర్ రుమనా అహ్మద్‌కు షాకిచ్చారు.

## ప్రపంచ నంబర్-1 ఆల్‌రౌండర్‌గా

# లియామ్ లివింగ్‌స్టోన్



అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) బుధవారం టీ20 ఆటగాళ్ల ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్ తన అద్భుతమైన ప్రదర్శనతో ర్యాంకింగ్స్‌లో దూసుకెళ్లి నంబర్ వన్ ఆల్ రౌండర్‌గా నిలిచాడు. ఇటీవల ఆస్ట్రేలియాతో ముగిసిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో లియామ్ బ్యాట్, బాల్‌తో అదరగొట్టాడు. లివింగ్‌స్టోన్ రెండు మ్యాచ్‌ల్లో 124 పరుగులు చేసి ఐదు వికెట్లు తీశాడు. ఒక మ్యాచ్‌లో లియామ్ లివింగ్‌స్టోన్ 47 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో 87 పరుగులతో ఇన్నింగ్స్ ఆడాడు. అతని ఇన్నింగ్స్‌తో ఇంగ్లండ్ రెండో టీ20లో 194 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. రెండు మ్యాచ్‌లలో అతను అత్యు త్తము ప్రదర్శన చూపించడంతో.. లియామ్ ఏడు స్థానాలు ఎగబాకి ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ దూసుకొచ్చాడు. అంతకుముందు.. మొదటి స్థానంలో మార్కస్ స్టైనిస్ ఉండగా.. అతను రెండు స్థానాలు కోల్పోయాడు. భారత ఆల్‌రౌండర్లలో టాప్-10లో హార్దిక్ పాండ్యా ఏకైక ఆటగాడిగా ఉన్నాడు. హార్దిక్ 199 పాయింట్లతో ఏడో స్థానంలో, అక్షర్ పేటల్ 149 పాయింట్లతో 11వ స్థానంలో కొనసాగుతున్నారు. మరోవైపు..

బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్ జోస్ ఇంగ్లిష్ టాప్-10లో చోటు దక్కించుకున్నాడు. 13 స్థానాలు ఎగబాకి 10వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. అలాగే.. ట్రావిస్ హెడ్ స్థానం అలానే ఉండగా.. భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.


GS9 TV తెలుగు
తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

అతి కొద్ది కాలంలోనే ప్రజలకు ప్రజాప్రతినిధులకూ వారధి గా ప్రదర్శింపబడుతున్న
GS9TV కేబుల్ ఛానల్, తెలంగాణ వీణ తెలుగు దినపత్రికకు
అన్నీ జిల్లాల నుండి విలేకరులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.

సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు
8328209811
9703024024




# కన్నడ చిత్రంలోనూ.. వేధింపులు

## - నటి నీతూశెట్టి ఆరోపణలతో కలకలం



మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న వేధింపుల గురించి జస్టిస్ హేమ కమిటీ రూపొందించిన రిపోర్ట్ ఇప్పుడు అన్ని భాషల్లోనూ కలకలం రేపుతోంది. ఈనేపథ్యంలోనే కన్నడ చిత్ర పరిశ్రమలోనూ ఇలాంటి పరిస్థితులే ఉన్నాయని నటి నీతూశెట్టి షాకింగ్ ఆరోపణలు చేశారు. తాజాగా ఓ జాతీయ మీడియాతో మాట్లాడిన ఆమె కొన్ని కీలక విషయాలు బయటపెట్టారు. కన్నడ చిత్రపరిశ్రమలోనూ మహిళలు వేధింపులు ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయి. వాటిని బయటకు రానివ్వరు. గతంలో ఒక నిర్మాత నాతో ఇబ్బందికరంగా ప్రవర్తించాడు. సినిమా చర్చలో భాగంగా ఆయన్ని కలిశాను. సినిమా గురించి పక్కన పెట్టి హాలీడే కోసం తనతో గోవాకు రమ్మని పిలిచాడు అని నీతూశెట్టి ఆరోపించారు. 'కన్నడ చిత్ర పరిశ్రమలో నటించిన ఏ నటినైనా అడగండి. వాళ్ల దగ్గర చెప్పడానికి తప్పకుండా ఒక వేధింపుల కథ ఉంటుంది' అని మరో నటి ఆరోపించారు. అయితే తాను ఎవరి వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నది చెప్పాలనుకోవడం లేదన్నారు. జస్టిస్ హేమ కమిటీ వంటి కమిటీలు అన్నిచోట్లా ఉండాలని, అప్పుడే ఎన్నో విషయాలు వెలుగులోకి వస్తాయని ఆమె వివరించారు. దాదాపు ఏడేళ్లపాటు శ్రమించి జస్టిస్ హేమ కమిటీ ఈ నివేదికను సిద్ధం చేసింది. మలయాళ సినీ పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వర్కింగ్ కండిషన్లు, రెమ్యూనరేషన్, సాంకేతిక రంగంలో మహిళల భాగస్వామ్యం తదితర అంశాలను అధ్యయనం చేసిన కమిటీ.. కాస్టింగ్ కౌచ్ మొదలు వివక్ష వరకు మాలీవుడ్‌లో మహిళలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. ఈ నివేదికలో వెల్లడించిన పలు అంశాలు అంతటా తీవ్ర చర్చకు దారి తీశాయి. ఈనేపథ్యంలోనే నటీమణులకు ఎలాంటి సమస్యలు ఉన్నాయనే అంశాలు తెలుసుకోవడంపై పలు చిత్ర పరిశ్రమలు దృష్టిపెట్టాయి. ఇటీవల కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆ పరిశ్రమకు చెందిన తారలతో సమావేశం నిర్వహించి వారికి ఎలాంటి పరిస్థితులు ఉన్నాయనే విషయాన్ని అడిగి తెలుసుకుంది.

# పూనం కౌర్ ఆరోపణలపై ఫిలిం చాంబర్ స్పందన

## - నేరుగా లేదా..మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచన




గత రెండు రోజులుగా జానీ మాస్టర్ వివాదం రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది. టాలీవుడ్ లైంగిక వేధింపుల పరిష్కార ప్యానెల్ విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి జానీ మాస్టర్ మీద ఆరోపణలు రాగానే వివాదం తేలే వరకు అతన్ని డాన్సర్ అసోసియేషన్ అధ్యక్ష పదవి నుంచి తప్పించాలని ఫెడరేషన్‌ను ఆదేశించామని అన్నారు. తాజాగా.. ఫిలిం ఛాంబర్ సెక్రటరీ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ.. మహిళల భద్రత విషయంలో టాలీవుడ్ మిగతా చిత్ర పరిశ్రమల కంటే ఎంతో ముందుందని, వర్క్ ప్లేస్ లో అమ్మాయిలకు వేధింపులు ఉంటే ఖచ్చితంగా ఎంత పెద్దవారినైనా మేము విచారిస్తాం అన్నారు. పూనమ్ కౌర్ కమిటీలో రిపోర్ట్ చేయకుండా.. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే ఉపయోగం లేదని, వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. ఎవరికి ఎంత ఇన్ ఫ్లూయెన్స్ ఉన్నా.. కమిటీ విచారణ మాత్రం న్యాయబద్దంగా జరుగుతుందన్నారు. ప్రభుత్వ తరపునుంచి గైడ్ లైన్స్ వస్తే కమిటీకి మరింత బలం చేకూరుతుందన్నారు. ఇదిలాఉండగా.. లైంగిక వేధింపులు ఎదుర్కొన్న వారు,ఎదుర్కొంటున్న వారు టీఎఫ్‌సీసీకి ఎనీ టైం ఫిర్యాదు చేయాలని ఒక ప్రకటనలో పేర్కొంది. హైదరాబాద్ తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆఫీసు వద్ద ఉదయం 6గంటల నుండి రాత్రి 8 గంటల వరకు కంప్లైంట్ బాక్స్ అందుబాటులో ఉంటుందని పేర్కొంది. తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్, డి.రామానాయుడు బిల్డింగ్ కాంప్లెక్స్, ఫిల్మ్‌నగర్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ – 500096 చిరునామాకు పోస్టుద్వారా అయినా ఫిర్యాదు చేయవచ్చని తెలిపింది. ఫోన్ నంబరు : 98499 72280కు ఫిర్యాదు ఇవ్వొచ్చని విజ్ఞప్తి చేసింది.

# యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా మ్యాడ్




సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం మ్యాడ్ యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ మూవీకి సీక్వెల్ మ్యాడ్ స్క్వేర్ వస్తుందని తెలిసిందే. మేకర్స్ ముందుగా ప్రకటించిన ప్రకారం ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఫస్ట్ లుక్‌లో సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్ చొక్కా, లుంగీలో స్టైలిష్‌గా కనిపిస్తూ..బాయ్స్ మ్యాడ్ మ్యాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో తిరిగొస్తున్నట్టు ఫస్ట్ లుక్ చెప్పకనే చెబుతోంది. ఈ మూవీ ఫస్ట్ సింగిల్‌ను ఈనెల 20న విడుదల చేస్తున్నట్టు తెలియజేశారు. సీక్వెల్‌కు కూడా కల్యాణ్ శంకర్ దర్శకత్వం వహిస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఫస్ట్ పార్టులోశ్రీగౌరి ప్రియా రెడ్డి, అనంతికా సనిల్‌కుమార్, గోపికా ఉద్యన్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటించగా.. మరి సీక్వెల్‌లో ఎవరెవరు సందడి చేయబోతున్నారనేది ప్రస్తుతానికి సస్పెన్స్ నెలకొంది. ఈ చిత్రాన్ని నాగవంశీ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై హారికా సూర్యదేవర, సాయి సౌజన్య సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నాడు.

# చిత్ర పరిశ్రమలో విషాదం.. ప్రముఖ నటి మృతి



చిత్ర పరిశ్రమలో విషాదం చోటు చేసుకుంది. దక్షిణాది అలనాటి నటి సీఐడీ శకుంతల కన్నుమూశారు. ప్రస్తుతం ఆమె వయసు 84. ఛాతి నొప్పితో బాధపడుతున్న ఆమె నిన్న సాయంత్రం బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆమె మరణ వార్త తెలుసుకున్న అభిమానులు, పలువురు సినీ సెలబ్రిటీలు నటి మృతిపై సంతాపం వ్యక్తం చేస్తున్నారు.కాగా, తెలుగు, కన్నడ, తమిళ, మలయాళం భాషల్లో దాదాపు 600కిపైగా సినిమాల్లో నటించారు. లెజెండరీ నటులు ఎంజీఆర్, శివాజీ వంటి వారితో స్క్రీన్ షేర్ చేసుకున్నారు. తెలుగులో బుద్ధిమంతుడు, నేను మనిషేనే వంటి సినిమాల్లో కనిపించారు. సినిమాల్లోనే కాదు పలు సీరియల్లోనూ ఆమె నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. సీఐడీ ధారావాహికతో ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నారు. ఇక అప్పటి నుంచి ఆమెను అంతా సీఐడీ శకుంతలగానే గుర్తిస్తున్నారు.













Published and Printed by Vulloju Srinivas On Behlf of Sri Veena Publications Printed at Telalangana Veena Flat NO: 204 Mythri Apartments, Opp Bsnl Office Ecil,Kapra,Med Responsibble for Selection of News Under The PRB ACT, Phone Number: 040 35668720, RNI Reg N0: TELTEL/12280 Reproduction in Whole or in Part Without Written